DATE: 16-04-2022 RNI NO : TELTEL/2021/81092 prajamantalu, Jagitial

ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

prajamantalu.com

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 16

పేజీలు - 08
వెల: రూ 5/-

ఆదివారం 17 ఏప్రిల్, 2022

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



ప్రశాంతంగా హనుమాన్ శోభాయాత్ర
భారీ బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు

5లో



ఎఫ్‌సీఐ బియ్యం కుంభకోణంపై సీబీఐ విచారణ
కేసీఆర్ అధికార ఉన్మాదిగా మారి దోచుకుంటున్నారు

5లో

# వచ్చే లోక్‌సభలో..

## 370 నుంచి 400 స్థానాల లక్ష్యం

- సోనియాతో ప్రశాంత్ కిశోర్ భేటీ
- రానున్న ఎన్నికలపై సమాలోచనలు




**న్యూఢిల్లీ,ఏప్రిల్16:** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 370 నుంచి 400 స్థానాలను గెలవాలని లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగాలని కాంగ్రెస్‌కు ఎన్నికల ప్రచార వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సలహా ఇచ్చారు. కాంగ్రెస్ బలహీనంగా ఉన్నచోట్ల ఇతర పార్టీలతో వ్యూహాత్మకంగా పొత్తు పెట్టుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, పార్టీ ఉన్నత స్థాయి నేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులతో శనివారం జరిగిన సమావేశంలో ఈ సలహా ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సోనియా గాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, అంబికా సోనీ,

- మిగతా 2లో

### నీట్ పరీక్ష నుంచి తమిళనాడుకు

# మినహాయింపు

- బిల్లును తొక్కిపెట్టిన గవర్నర్ రవి
- మండిపడుతున్న డిఎంకె సర్కార్



**చెన్నై,ఏప్రిల్16:** వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ పరీక్ష నుంచి తమిళనాడుకు మినహాయింపు ఇవ్వాలంటూ గతేడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపించింది. అయితే దీనిపై ఎటూ తేల్చకుండా గవర్నర్ తాత్సారం చేశారు. విమర్శలు రావడంతో చివరకు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉన్నదంటూ ఆ బిల్లును అసెంబ్లీ పరిశీలనకు ఈ నెల 3న గవర్నర్ తిరిగి పంపారు. దీంతో ఫిబ్రవరి 8న మరోసారి రెండో బిల్లును

- మిగతా 2లో

## 22 జిల్లా జడ్జిల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల


హైదరాబాద్,ఏప్రిల్16: తెలంగాణలో 22 జిల్లా జడ్జిల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. జిల్లా జడ్జిల్లో 13 నేరుగా.. మరో 9 సీనియర్ సివిల్ జడ్జిలకు నియామక పరీక్ష ద్వారా

- మిగతా 2లో

# ధాన్యం కొనుగోళ్లకు

# చురుకుగా ఏర్పాట్లు

- ప్రభుత్వ ప్రకటనతో ఊపిరిపీల్చుకున్న రైతులు
- ఏటా గోనెసంచుల కొరతతో అధికారుల తంటాలు
- ప్రత్యేక పరిస్థితుల్లో తెలంగాణలో ధాన్యం సేకరణ
- రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం సేకరించాలి
- పౌరసరఫరాల అధికారులకు మంత్రి గంగుల వినతి



**హైదరాబాద్,ఏప్రిల్16:** రాష్ట్రప్రభుత్వం ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామంటూ ప్రకటించిన నేపథ్యంలో పౌరసరఫరాలశాఖ ధాన్యం సేకరణ దిశగా చురుకుగా ఏర్పాట్లు మొదలుపెట్టింది. సిఎం కెసిఆర్ ఆదేశాలతో పాటు, సిఎస్ సమీక్షించిన ఆదేశాల మేరకు అధికారులు రంగం సిద్ధం చేశారు. కేంద్రంతో వివాదం ఏర్పడడంతో పాటు కొనుగోళ్ల వ్యవహారమంతా గందరగోళంగా



మారడంతో ధాన్యం రైతులు తీవ్ర అయోమయానికి గురయ్యారు. ఎట్టకేలకు రాష్ట్రప్రభుత్వం కొనుగోళ్లను ప్రారంభిస్తామని ప్రకటించడమే కాకుండా ఆ దిశగా యంత్రాంగమంతా ఏర్పాట్లు చేయాలంటూ ఆదేశించింది.

- మిగతా 2లో



### కోటి 42 లక్షల ఎకరాలలో సాగుకు

# సన్నాహాలు

- పత్తిసాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందాలి
- వానాకాలం సాగు ప్రణాళికపై మంత్రి నిరంజన్ సమీక్ష

**హైదరాబాద్,ఏప్రిల్16:** తెలంగాణలో ఈ వానాకాలంలో కోటి 42 లక్షల ఎకరాలలో సాగుకు సన్నాహాలు చేస్తున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది పత్తి వేయకుండా రైతులు నష్టపోయారు. ఈ ఏడాది రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని అధికారులను

- మిగతా 2లో

## నిప్పంటించుకుని తల్లీకొడుకు ఆత్మహత్య

- సిఐ తదితరులు కారణమంటూ సెల్ఫీ వీడియో
- ఘటనాస్థలి వద్ద విచారణ..దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**కామారెడ్డి,ఏప్రిల్16:** కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని న్యూమహారాజా లాడ్జిలో నిప్పంటించుకుని తల్లి, కొడుకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులను రామాయంపేటకు చెందిన గంగం పద్మ, సంతోష్‌లుగా గుర్తించారు. అయితే వేధింపుల వల్లే

- మిగతా 2లో




## 27న టీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం

### మాదాపూర్ హైటెక్స్‌లో భారీగా ఏర్పాట్లు
### ఘనంగా నిర్వహించేలా ప్రణాళిక

**హైదరాబాద్,ఏప్రిల్16:** టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని టిఆర్ఎస్ నిర్ణయించింది. గతేడాది పెద్దగా కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఇప్పుడు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27వ తేదీన మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించాలని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. 27న ఉదయం 10 గంటల వరకు హెచ్ఐసీసీకి చేరుకోవాలని పార్టీ ప్రతినిధులందరికీ సీఎం సూచించారు. మారిన రాజకీయసమీకరణల నేపథ్యంలో దీనిని ఇప్పుడు ఘనంగా నిర్వహించబోతున్నారు. పార్టీ వేదిక ద్వారా శ్రేణులకు కెసిఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రివర్గంతో పాటు లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గం, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్‌లు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయాల సంస్థ అధ్యక్షులు, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు, మహిళా కోఆర్డినేటర్లు, జడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ మేయర్లు, చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులు,

- మిగతా 2లో

## ప్రజానాడి




## తెలంగాణకు కేంద్రం మరో దోఖా

- సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ కేటాయింపులో వివక్ష
- తెలంగాణకు వివక్షపై కేంద్రమంత్రికి కేటీఆర్ లేఖ



**హైదరాబాద్,ఏప్రిల్16:** సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్టీపీఐ) కేటాయింపులోనూ తెలంగాణపై కేంద్రం తీవ్ర వివక్ష చూపిందని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రం తాజాగా ప్రకటించిన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కుల్లో ఒక్కటంటే ఒక్కటికూడా తెలంగాణకు కేటాయించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. యూపీ, ఎంపీ, గుజరాత్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, బీహార్, పంజాబ్, జార్ఖండ్, కేరళ రాష్ట్రాలకు 22 ఎస్టీపీఐలను కేటాయించిన కేంద్రం.. తెలంగాణకు ఒక్కటి కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఈ విషయంపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి కేటీఆర్ లేఖ రాశారు. పెద్ద ఎత్తున ఐటీ పరిశ్రమతోపాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ పరిశ్రమ విస్తరిస్తున్న

- మిగతా 2లో

# వచ్చే లోక్‌సభలో..

## 370 నుంచి 400 స్థానాల లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

అజయ్ మాకెన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రశాంత్ కిశోర్ ఓ ప్రజంటేషన్‌ను సమర్పించినట్లు విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. ప్రశాంత్ కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం కూడా ఉందని చెప్తున్నాయి. ఃశ్వసనీయ సమాచారం ప్రకారం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 370 నుంచి 400 స్థానాలను సాధించాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకోవాలని ప్రశాంత్ కిశోర్ చెప్పారు. కాంగ్రెస్ బలహీనంగా ఉన్నచోట్ల వ్యూహాత్మకంగా పొత్తులు కుదుర్చుకోవాలని తెలిపారు. ఆయన ఆ పార్టీలో చేరే అవకాశం ఉందని, అందుకు ప్రతిఫలంగా ఆయన ఏమీ కోరుకోవడం లేదని కూడా తెలుస్తోంది. ఈ సమావేశంలో ఆయన ప్రదర్శించిన ప్రజెంటేషన్‌లో పేర్కొన్న అంశాలపై చర్చించేందుకు కాంగ్రెస్ ఓ బృందాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు సమాచారం. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ శనివారం కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీతో సమావేశమయ్యారు. సోనియా గాంధీ నివాసంలో జరిగిన ఈ భేటీలో ఎంపీ రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, మల్లికార్జున ఖర్గే తదితర నేతలు కూడా పాల్గొన్నారు. కాగా ప్రశాంత్ కిషోర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్న తరుణంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ క్రమంలో కాంగ్రెస్‌లో ప్రశాంత్ కిషోర్ చేరిక దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. గాంధీ కుటుంబంతో ప్రశాంత్ కిషోర్ బేటీలో ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల పరాజయంతో సహా అనేక ఇతర కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను పటిష్టం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు సమాచారం. గుజరాత్ పోల్స్‌పై చర్చించడానికే ఈ భేటీ జరిగిందని.. గుజరాత్‌తో పాటు రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల బ్లూప్రింట్‌పై కూడా చర్చించినట్లు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, 2024 సార్వత్రిక ఎన్నికలతో పాటు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార బాధ్యతలను కాంగ్రెస్ పార్టీ ప్రశాంత్ కిషోర్‌కు అప్పగిస్తుందనే వార్తలు కూడా ప్రచారంలో ఉన్నాయి. అయితే పీకే మాత్రం గుజరాత్ ఎన్నికలకు మాత్రమే పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. కాగా తన రాజకీయ భవిష్యత్తుపై మే 6లోగా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటానని ప్రశాంత్ కిషోర్ ఇదివరకే ప్రకటించగా.. ఆలోపే కాంగ్రెస్‌లో చేరికపై స్పష్టత రానుంది.

## నీట్ పరీక్ష నుంచి తమిళనాడుకు

# మినహాయింపు

మొదటిపేజీ తరువాయి..

అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపారు. అయితే దీనిని కూడా గవర్నర్ రవి పక్కన పెట్టారు. దీంతో విద్యార్థుల ప్రయోజనా లను పట్టించుకోకుండా గవర్నర్ వ్యవహరిస్తున్నారని ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తంచేసింది. బిల్లును రెండోసారి కూడా గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదించకపోవడంతో ప్రభుత్వం భగ్గుమన్నది. దీంతో బిల్లును ఆమోదిం చేవరకు రాజ్‌భవన్‌కు తాము దూరంగా ఉంటామని ప్రకటించింది. ఈ క్రమంలో రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమాన్ని కూడా బహిష్కరించింది. ఈ నేపథ్యంలో శనివారం మురసోలి పత్రికలో గవర్నర్ వ్యవహార శైలిపై ఎడిటోరియల్ ప్రచురించింది. గవర్నర్ తీరు చూస్తుంటే తాను రాష్ట్రపతిగా భావిస్తున్నారని విమర్శించింది. తమిళనాడు అసెంబ్లీ పాస్ చేసిన బిల్లును ఆమోదించి, దానిని రాష్ట్రపతికి పంపించడం గవర్నర్ విధి. అయితే దానిని నిర్వర్తించడంలో విఫలమయ్యారు. ఆర్‌ఎన్ రవిని కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నది. అసలు నీట్ బిల్లును ప్రభుత్వం ఎందుకు తీసుకురావల్సి వచ్చిందనే విషయాలను కూడా ఆ వ్యాసంలో వివరించింది. తాజాగా అధికార డీఎంకేకి చెందిన మురసోలి పత్రిక గవర్నర్ తీరుపై విరుచుకుపడింది. 'గవర్నర్ సర్.. మీరు రాష్ట్రపతి కాదు. ప్రభుత్వం రూపొందించిన బిల్లులకు ఆమోదం తెలపడం మీ కర్తవ్యం. రాజ్యాంగం ప్రకారం సక్రమంగా విధులు నిర్వహించాలని' తన సంపాదకీయంలో రాసుకొచ్చింది.

## 22 జిల్లా జడ్జిల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

మొదటిపేజీ తరువాయి..

పదోన్నతి పద్ధతిలో భర్తీ చేయనున్నారు. మే 2 వరకు సీఎస్ కార్యాలయానికి దరఖాస్తులను సమర్పించాలని ప్రభుత్వం తెలిపింది. కనీసం ఏడేళ్ల అనుభవం ఉన్న న్యాయవాదులు జిల్లా జడ్జి ఉద్యోగానికి అర్హులు. రాతపరీక్ష, వైవా ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. మరో 9 జిల్లా ఉద్యోగాల పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. కనీసం ఐదేళ్ల అనుభవం కలిగిన సీనియర్ సివిల్ జడ్జిలను రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 11

## తెలంగాణకు కేంద్రం మరో దోఖా

మొదటిపేజీ తరువాయి..

నేపథ్యాన్ని పట్టించుకోకుండా ఎస్టీపీఐ కేటాయింపుల్లో తెలంగాణను పరిగణలోకి తీసుకోకపోవడం దారుణమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇక్కడి యువత ఉపాధి అవకాశాలను కేంద్ర ప్రభుత్వం దారుణంగా దెబ్బతీసిందని మండిపడ్డారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్) రద్దు చేసి, తెలంగాణ ఐటీ రంగానికి, యువతకు తీరని ద్రోహం చేసిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు.దేశ ఐటీ పరిశ్రమలో అద్భుతంగా రాణిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని, కొన్నేళ్లుగా జాతీయ సగటు కన్నా ఎక్కువ వృద్ధిరేటును నమోదుచేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. 2014–15వ సంవత్సరానికి రూ. 57,258 కోట్లున్న ఐటీ ఎగుమతులు.. తాజాగా, రూ. 1,45,522 కోట్లకు పెరిగాయని, ఐటీ రంగంలో ఉద్యోగుల సంఖ్య కూడా రెట్టింపైందని తెలిపారు. ప్రస్తుతం తమ రాష్ట్రంలోని ఐటీరంగంలో 6,28,000పైగా మంది పనిచేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. దీంతోపాటు భవిష్యత్తు వృద్ధిని చాటే కమర్షియల్ ఆఫీస్ స్పేస్ విషయంలోనూ తెలంగాణ బెంగళూరును పదే పదే దాటుతున్న విషయాన్నినొక్కిచెప్పారు. ఐటీ పరిశ్రమ అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రం అనేక పాలసీపరమైన నిర్ణయాలు తీసుకున్నదన్నారు. ఎలక్ట్రానిక్, రూరల్ టెక్నాలజీ, ఇమేజ్, డేటా సెంటర్‌లాంటి వివిధ రంగాలకు ప్రత్యేకమైన పాలసీలతో ఐటీ రంగ అభివృద్ధిని సాధిస్తున్న విషయాన్ని, అయా పాలసీలకు దేశవ్యాప్తంగా దక్కుతున్న ప్రశంసలను మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా తన లేఖలో ప్రస్తావించారు. దేశ ఐటీ రంగంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఒక ప్రముఖమైన ఐటీ హబ్‌గా హైదరాబాద్..మారిందని, హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీలు పెద్ద ఎత్తున కార్యకలాపాలను విస్తరిస్తున్నాయని మంత్రి కేటీఆర్ లేఖలో తెలిపారు. కొన్నేళ్లుగా హైదరాబాద్ నగరంతోపాటు ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం పాలసీ పరమైన నిర్ణయాలతోపాటు మౌలిక వసతులు కల్పిస్తున్న విషయాన్ని వివరించారు. ఇప్పటికే తెలంగాణ సర్కారు ఆయా పట్టణాల్లో ఏర్పాటు చేసిన ప్లగ్ అండ్ ప్లే మౌలిక వసతులను వినియోగించుకొని వివిధ కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించిన విషయాన్ని కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఈ ఐటీఐఆర్ పునరుద్ధరణ కోసం సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధాని మోడీని కలిసినా, ఐటీ మంత్రిగా తాను, తమ ఎంపీల బృందం పదేపదే కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞప్తులు చేసినా స్పందన లేదన్నారు. పైగా ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కుల కేటాయింపులో సంపూర్ణంగా తెలంగాణకు అన్యాయం చేయడం కేంద్ర వివక్షపూరిత వైఖరికి నిదర్శనమన్నారు.

దేశంలో అంతర్భాగమైన తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధిస్తే..అది దేశ హితానికి, పురోగతికి తోడ్పడుతుందన్న ఆలోచనను, విశాల దృక్పథాన్ని కేంద్రం అంగీకరించాలని మంత్రి కేటీఆర్ కోరారు. తెలంగాణ రాష్ట్రానికి సాప్టేర్ టెక్నాలజీ పార్కులను కేటాయించే విషయాన్ని పునఃపరిశీలించాలని లేఖలో కోరారు. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ పట్టణాలకు ఎస్టీపీఐలను కేటాయించాలని కేంద్ర మంత్రిని కేటీఆర్ కోరారు. ఐటీ రంగంలో ప్రగతి సాధిస్తున్న తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిస్తోందని మండిపడ్డారు. కేంద్ర సర్కార్ నిర్ణయంతో రాష్ట్ర యువత ఉపాధి అవకాశాలకు విఘాతం కలుగుతోందన్నారు. ఇప్పటికే ఐటీఐఆర్ రద్దుతో యువత, ఐటీ రంగానికి అన్యాయం జరుగుతుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## ధాన్యం కొనుగోళ్లకు

# చురుకుగా ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి..

దీంతో అధికారులు ఇప్పటికే రూపొందించిన ప్రణాళిక ఆధారంగా ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఈ మేరకు పలు జిల్లాల్లో కొనుగోలుఏ కేంద్రాలను ప్రారంభించారు. మరోవారం రోజుల్లోగా కోతలు మొదలుకానుండడమే కాకుండా ధాన్యమంతా చేతికి అంద బోతోంది. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరికి క్వింటాల్‌కు రూ.1960, బి గ్రేడ్ వరికి క్వింటాల్‌కు రూ.1940లను మద్దతు ధరగా ప్రకటించింది.ప్రస్తుతం కొనుగోలు చేసే ధాన్యాన్ని నిల్వ ఉంచే వ్యవహారం కూడా అధికారులకు కత్తిమీద సాములా మారబోతోందంటున్నారు. కాగా సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాలోకి ధాన్యం రాకుండా అడ్డుకునేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. గోనెసంచుల కిరికిరిప్రతీసారి ధాన్యాన్ని ఉంచేందుకు అవసరమయ్యే గోనే సంచుల కొరత తీవ్రమవుతున్న సంగతి తెలిసిందే. పంట కొనుగోలుకు అనుగుణంగా గోనెసంచులు అందుబాటులో లేకపోతుండడం ఇబ్బందులకు కారణమవుతోంది. కొనుగోళ్ళు ప్రారంభమైన కొద్దిరోజులకే గోనెసంచుల నిల్వలు అయిపోతున్న కారణంగా అధికారులు ఈ సంచుల కోసం నానా తంటాలు పడుతున్నారు. కాగా గోనే సంచులు సైతం బహిరంగ మార్కెట్‌లో అందుబాటులో ఉ ఒడడం లేదు. ప్రస్తుతం గోనే సంచుల వినియోగం కూడా తగ్గుముఖం పట్టడంతో వీటి ఉత్పత్తి పెద్దగా జరగడం లేదంటున్నారు. కేవలం ధాన్యంకోసం మాత్రం గోనె సంచుల అవసరం ఏర్పడుతోంది. అయితే అధికారులు కొనుగోలుకు సంబందించి ఏర్పాట్లలో భాగంగా గోనెసంచుల సేకరణ కోసం కసరత్తు మొదలుపెట్టారు. సమస్యగా మారనున్న గిడ్డంగుల కొరతజిల్లాలో ప్రతీఏటా పంటలను నిల్వ చేసేందుకు అవసరమయ్యే గిడ్డంగుల సౌకర్యం కొరతగా మారుతోంది. పంటల నిల్వ సామర్థ్యానికి అనుగుణంగా గిడ్డంగులు అందు బాటులో లేకపోతుండడం ఇక్కట్లకు కారణమవు తోందంటున్నారు.



రైతుల నుంచి ధాన్యం కొను గోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత అధికారులు అందుకు సన్నద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో వరికోతలు ప్రారంభం కాకముందే సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. యాసంగి ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష ఆందోళనలకు దిగడంతో వరి పండించిన రైతుల్లో ఒకింత ఆందోళన మొదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఒకరిపై ఒకరు నెపం మోపుతుండటంతో పంటను ఎలా విక్రయించాలో తెలియక అన్నదాతలు మనస్తాపానికి గురయ్యారు. ప్రభుత్వంపై నమ్మకంతో దొడ్డు రకం సాగు చేస్తే, తీరా పంట చేతికి వచ్చే సమయానికి ప్రభుత్వాలు పేచీలు పెట్టడంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొ న్నాయి. మొదటి నుంచి ముడి బియ్యం కొనుగోలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఉప్పుడు బియ్యం కూడా కొనాలని కేసీఆర్ ప్రభుత్వం డిమాండ్ చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ ఎస్ నేతలు ఢిల్లీలో ఈ నెల 11న ధర్నా నిర్వహించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో తామే కొనుగోలు చేస్తామంటూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సిద్ధం కావాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు దాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. యాసంగిలో తెలంగాణ ప్రత్యేక పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకొని తెలంగాణ రైతుల్ని ఇబ్బంది పెట్టొద్దని ఎఫ్‌సిఐ అధికారులకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ విజ్ఞప్తి చేశారు. యాసంగి ధాన్యం సేకరణపై ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ దీపక్ శర్మతో మంత్రి గంగుల కమలాకర్ భేటీ అయ్యారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషన్ అనిల్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐకి తెలంగాణ ఈ యాసంగిలో చేయబోయే ధాన్యం సేకరణ వివరాల్ని వెల్లడించారు. నూక శాతం ఎక్కువగా ఉండే నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాలతో రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అదనపు భారాన్ని భరించి ధాన్యం సేకరిస్తున్నామని, సీఎంఆర్ సమయంలో అనవసర కొర్రీలు పెట్టి ఇబ్బందులు సృష్టించొద్దన్నారు. నాణ్యతా ప్రమాణాల మేరకు ముడి బియ్యం అందజేస్తామని, ఇందు కోసం లేఖల్ని కేంద్ర ప్రభుత్వానికి, ఎఫ్‌సీఐ అందజేస్తామన్నారు. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో బ్రోకెన్ శాతం ఎక్కువగా ఉండే నేపథ్యంలో ఎఫ్‌సీఐ ఎలాంటి అభ్యంతరాలు లేకుండా తీసుకోవాలని కోరారు. గత యాసంగిలో తీసుకోవాల్సిన 2.52లక్షల మెట్రిక్ టన్నులు ఫోర్టిఫైడ్ బాయిల్డ్ రూపంలో తీసుకోవాలని.. గత వానాకాలం సీఎంఆర్ వేగంగా అందించే విధంగా ర్యాకులు, అదనపు స్టోరేజీ కల్పించాల్సిందిగా కోరారు. సీఎంఆర్ గడువులో తక్కువ ధాన్యం సేకరించే రాష్ట్రాలకు అధికంగా సేకరించే తెలంగాణకు ఒకే గడువు ఇస్తున్న అసమగ్ర విధానాన్ని సైతం పునఃసమీక్షించాలని, అదనపు గడువును సైతం కేవలం నెలరోజులకు మాత్రమే ఇస్తున్న అంశాన్ని దీపక్‌శర్మ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాల్సిందిగా మంత్రి గంగుల కమలాకర్ కోరారు. 35.80 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నులను సేకరిస్తున్నామని వీటికి 15కోట్ల గన్నీ సంచులు అవసరమని, వీటి కోసం జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు లేఖ రాసామని వారు సప్లై చేయగా మిగిలనవి జెమ్ పోర్టల్‌తో పాటు బహిరంగ వేలం ద్వారా సేకరిస్తామన్నారు. అలాగే యాసంగి సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడడానికి ఎఫ్‌సీఐ నుంచి డీజీఎం కమలాకర్, సివిల్ సప్లైస్ కార్పోరేషన్ నుంచి జీఎం రాజిరెడ్డిలను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తామని మంత్రి గంగుల తెలిపారు. అనంతరం సివిల్ సప్లైస్ అధికారులతో సమీక్షలో ధాన్యం కొనుగోలు పక్రియ సజావుగా జరిగేలా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అదనపు భారాన్ని భరించి దేశంలో ఎక్కడాలేని విదంగా కనీస మద్ధతు ధరతో ధాన్యం సేకరణ చేస్తున్న నేపథ్యంతో పక్క రాష్ట్రాల నుంచి ఒక్క వడ్ల గింజ మన కొనుగోలు కేంద్రాల్లోకి రాకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇందుకోసం విజిలెన్స్ టీం పక్కా ప్రణాళికలతో ఈ రెండు నెలలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి రీసైక్లింగ్ బియ్యం రాకుండా పటిష్ట చర్యలు తీసుకొని ఎక్కడికక్కడ అదుపు చేయాలని, వాటిపై కఠినంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేయాలన్నారు. రైస్ మిల్లర్ల వద్ద ఉన్న సివిల్ సప్లైస్ శాఖ గన్నీ సంచులు త్వరగా సేకరించాలని ఆదేశించారు. జిల్లాల్లో సివిల్ సప్లైస్ డీఎంలు, డీఎస్వోలు నిరంతర పర్యవేక్షణ చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎండలను తట్టుకునేలా నీడ సౌకర్యం ఏర్పాటు, మంచినీరు, అకాల వర్షాలు, గాలివానల నుండి రక్షణ చర్యలుగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాల వారీగా ఎప్పటికప్పుడు అవసరమైన మేర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు నిన్నటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 34 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. అనంతరం ధాన్యం సేకరణలో ఆర్థిక పరమైన అంశాలపై రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో బీఆర్కే భవన్‌లో భేటీ అయ్యారు. లోన్లపై రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ, గత బకాయిలు వంటి వాటిపై చర్చించారు. కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ దీపక్ శర్మ, సివిల్ సప్లైస్ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిప్పంటించుకుని తల్లీకొడుకు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి..

ఆత్మహత్యకు చేసుకుంటున్నామంటూ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. వీడియోలో తమ ఆత్మహత్యకు ఏడుగురు కారణమని తెలిపారు. గతంలో రామాయంపేటలో పనిచేసి ప్రస్తుతం తుంగతుర్తిలో పనిచేస్తున్న సీఐ నాగార్జునగౌడ్ సహా మరో ఆరుగురు ఆత్మహత్యకు కారణమంటూ గంగం సంతోష్, అతని తల్లి సెల్ఫీ వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సోమనాథం, పట్టణ సీఐ నరేష్ పరిశీలించారు. మృతులు తల్లి పద్మ, కుమారుడు సంతోష్‌లను రామాయంపేట్ వాసులుగా గుర్తించారు. తల్లి వైద్యం కోసం ఈ నెల 11న లాడ్జికి వచ్చినట్లు సమాచారం. ఘటనాస్థలిని డీఎస్పీ సోమనాథం, సీఐ నరేష్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.అయితే.. వారి ఆత్మహత్యకు కారణం ఏడుగురున్నట్టుగా రాసిన సుసైడ్ లేఖను పోలీసులు ఘటనాస్థలిలో స్వాధీనం చేస్తున్నారు. అదీ కాగా.. ఆత్మహత్యకు ముందు తల్లీకుమారుడు ఓ సెల్ఫీ వీడియో చిత్రీకరించారు.

ఈ వీడియోలో వారి వ్యథను వెల్లిబుచ్చారు. ఆత్మహత్య చేసుకోడానికి కారణమైన వారి గురించి, వారు తమ కుటుంబానికి చేసిన మోసాలు, పెట్టిన ఇబ్బందుల గురించి చెప్తూ.. కన్నీటి పర్యంతమయ్యారు. బాసం శ్రీనుతో కలిసి నేను వ్యాపారం చేశా. శ్రీను వద్ద డబ్బులు లేకపోతే జితేందర్ గౌడ్ ఇచ్చాడు. తర్వాత వ్యాపారంలో 50శాతం వాటా కావాలని జితేందర్ గౌడ్ కోరారు. ఇవ్వలేమని.. కుదరదని చెప్పాం. ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెడితే నన్ను పీఎస్‌కు పిలిచారు. నా ఫోన్‌ను అప్పటి సీఐ నాగార్జున గౌడ్ తీసుకున్నారు. నన్ను కేసులో ఇరికించేందుకు ప్రయత్నించారు. దీనిపై మరుసటి రోజే మెదక్ ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశా. 10 రోజులయ్యాక ఫేస్‌బుక్ అంశంలో సంబంధం లేదన్నారు. నా ఫోన్‌లో సమాచారాన్ని పోలీసులు జితేందర్‌గౌడ్‌కు ఇచ్చారు. అప్పటి నుంచి జితేందర్‌గౌడ్ మనుషులు ఫోన్‌లోని సమాచారంతో ఇబ్బంది పెట్టారు. నన్ను బెదిరించే విషయాన్ని కూడా పీఎస్‌లో ఫిర్యాదు చేశాను. ఏడాది పాటు జితేందర్ గౌడ్ మనుషులు నన్ను ఇబ్బంది పెట్టారు. నా వ్యాపారం సాగనీయలేదు, అర్థికంగా నష్టపోయాను. అప్పులు చేశాను. నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టారు. నన్ను మానసికంగా కుంగిపోయేలా చేశారు. నమ్మిన స్నేహితుడే దగా చేయడం తట్టుకోలేకపోయాను. వాళ్ల ఇబ్బందులు తట్టుకోలేకనే నేను, అమ్మ చనిపోతున్నామని వీడియోలో సంతోష్ పేర్కొన్నాడు.

## కోటి 42 లక్షల ఎకరాలలో సాగుకు

# సన్నాహాలు

మొదటిపేజీ తరువాయి..

ఆదేశించారు. ఈ సందర్భంగా 70 నుండి 75 లక్షల ఎకరాలలో పత్తి, 50 లక్షల ఎకరాలలో వరి,15 లక్షల ఎకరాలలో కంది, 11.5 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటలు పండించాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. వానాకాలం సాగు ప్రణాళికపై శనివారం మంత్రుల నివాస సముదాయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో 1332 పత్తి ఎక్కువ సాగు చేసే క్లస్టర్లు, వెయ్యికి పైగా వరి సాగు చేసే క్లస్టర్లు, 82 కంది సాగు చేసే క్లస్టర్లను గుర్తించామని మంత్రి తెలిపారు.క్లస్టర్ల వారీగా పంట ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆయా పంటలకు కావాల్సిన విత్తనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పచ్చి రొట్ట ఎరువులను ప్రోత్సహించి భూసారం పెంచే దిశగా రైతులను సన్నద్ధం చేయాలన్నారు. మే నెలలో వీటిని రైతులకు పంపిణీ చేయాలన్నారు.కల్తీలేని నాణ్యమైన విత్తనాల సరఫరాకు అధికారులు చర్యలు తీసుకో వాలని సూచించారు. కల్తీని నిరోధించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలన్నారు.రాష్ట్ర, జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేయాలని చెప్పారు. పంటల ప్రణాళిక ప్రకారం ఎరువులను సిద్ధంగా ఉంచాలన్నారు. మే నెలాఖరు నాటికి 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రష్యా – ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అన్ని ఎరువులు ముందస్తుగా అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి



పేర్కొన్నారు. దీనికి సంబంధించి మార్క్ ఫెడ్, వ్యవసాయ శాఖ తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. మే నెలలో క్షేత్రస్థాయిలో పర్యటించి వానాకాలం పంటల ప్రణాళికపై క్లస్టర్ల వారీగా రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. పంటల ప్రణాళికపై జిల్లాల వారీగా ఏఈఓలకు శిక్షణ కల్పించాలని, ఆయిల్ పామ్ సాగు కోసం వ్యవసాయ – ఉద్యాన అధికారులు సమన్వయంతో ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేయాలని అన్నారు. దీని కోసం వ్యవసాయ – ఉద్యాన అధికారులతో ఉమ్మడి సమావేశం నిర్వహించాలని సూచించారు. రైతువేదికలను అవగాహన కోసం విరివిగా ఉపయోగించుకోవాలని, రైతుబంధు సమితులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. ఈ సమావేశం లో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రత్యేక కమిషనర్ హన్మంతు, ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రామ్ రెడ్డి, విత్తనసంస్థ ఎండీ కేశవులు, మార్క్ ఫెడ్ ఎండీ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ పట్టణం 11వ డివిజన్ లోని వాసుదేవ కాలనీ రోడ్ నెంబర్ 5, 6 లో సిసి రోడ్డు పనులను ప్రారంభించిన డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న.



జగిత్యాల పట్టణ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్. పాల్గొన్న కౌన్సిలర్లు క్యాదాసు నవీన్, అల్లే గంగసాగర్, కోరే గంగమల్లు, భక్తులు



హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జగిత్యాల పట్టణ మంచినీళ్ళ బావివద్ద గల శ్రీ గుండు అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. పాల్గొన్న వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ పంబాల రాము, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, నాయకులు భూమన్న, బాలే శంకర్, డిష్ జగన్, గణేష్, శ్రీకాంత్, శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు

## గుడుంబా విక్రేతల అరెస్ట్


**మల్లాపూర్ ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** మల్లాపూర్ మండలంలోని మల్లాపూర్ తండాలో మెట్ పల్లి ఎక్సైజ్ అధికారులు, జిల్లా టాస్ ఫోర్స్ జగిత్యాల అధికారులు



నిర్వహించిన సంయుక్త దాడుల్లో తండాకు చెందిన సఫావత్ లక్ష్మి 4, లీటర్ల గుడుంబా గుగ్లవత్ లీల 2 లీటర్ల గుడుంబా కలిగి ఉన్నట్లు గుర్తించారు. వీరిరువురూ పై కేసు నమోదుచేశారు. ఎక్సైజ్ సీ.ఐ. ఎం. రాధా మాట్లాడుతూ... గుడుంబా తయారుచేసిన అమ్మిన రవాణా చేసిన వ్యక్తుల పై చట్టరీత్య చర్యలుంటాయని హెచ్చరించారు. ఇట్టి దాడుల్లో ఎక్సైజ్ ఎస్.ఐ. కె. సాయిబాబా, మజీద్, కానిస్టేబుల్ అఫ్రోజ్, రాంచందర్ సతీష్, డి.ఐ.టి. సిఐ ఎస్. అశోక్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



జగిత్యాల పట్టణములో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకర్ హాస్పిటల్ ను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, లైబ్రరీ ఛైర్మెన్ డా. చంద్రశేఖర్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్.



గొల్లపల్లి మండలం రంగదాముని పల్లి గ్రామంలో భూమి విషయంలో గొడవల కారణంగా చీపిరిశెట్టి శ్రీకాంత్ అను వ్యక్తిని తన రెండో అన్న గోపాల్ హత్య చేసినట్టు మృతుడి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్.ఐ. మాడ శ్రీధర్



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఫోరండ్ల గ్రామంలో ఈనెల 20న నిర్వహించే భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రవిష్కరణ కు ఎమ్మెల్యే రసమయిని ఆహ్వానించిన కమిటీ సభ్యులు







### శ్రీ హనుమాన్ జన్మదినోత్సవాలు

# హనుమాన్ జయంతిలో విద్యార్థులు

**సికింద్రాబాద్ ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** శ్రీ హనుమాన్ జన్మదినోత్సవాలు శనివారం సికింద్రాబాద్ లోని పలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి. బన్సీలాల్ పేట డివిజన్ కృష్ణానగర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడి వేషాధారణలతో అందరిని అలరించారు. స్కూల్ నుంచి భాజ భజంత్రీలతో ఊరేగింపుగా వెళ్ళి భోలక్ పూర్ లో వెలిసిన 41 అడుగుల హనుమంతుడి విగ్రహ ఆవిష్కరణ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా తమలపాకులతో దండ, గజమాలను స్వామివారికి సమర్పించి, శ్రీఆంజనేయస్వామి వారి సన్నిధిలో పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి వారి ఆశీస్సులను తీసుకున్నారు. ఈసందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డా.మంచాల శ్రీనివాసులు మాట్లాడుతూ...పిల్లల్లో భక్తి, సంస్కారం, బుద్ధి కలిగేలా చిన్నప్పటి నుంచే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడమే తమ ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది విజయ్ భాస్కర్, జ్యోతి, ఐలయ్య, సంపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

**సికింద్రాబాద్ సనత్ నగర్ లో........**

సనత్ నగర్ నియోజకవర్గంలో శనివారం శ్రీ హన్మాన్ జన్మదినోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. సనత్ నగర్ డివిజన్ లోని ఎస్ ఆర్ నగర్ పంచముఖి హనుమాన్ దేవాలయంలో జయంతి ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. ఈసందర్భంగా పార్టీలకతీతంగా నిర్వహించిన శోభయాత్రలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మర్రి పురురవ రెడ్డి, సనత్ నగర్ కార్పొరేటర్ లక్ష్మీ బాల్ రెడ్డి లు పాల్గొన్నారు. దారి వెంట శ్రీరాముడి , ఆంజనేయస్వామి సంకీర్తనలతో భక్తులు సందడి చేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బి బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పి.నరేందర్, నాయకులు వంశీ, కృష్ణకుమారి, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**సికింద్రాబాద్, బన్సీలాల్ పేటలో .......**

బన్సీలాల్ పేట డివిజన్ లో శనివారం శ్రీహన్మాన్ జన్మదినోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. భోలక్ పూర్ హన్మాన్ ఆలయం, శ్రీసీతారామాంజేయస్వామి ఆలయం, ఫూల్ బాగ్ అంజన్న ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయాల్లో జరిగిన ఉత్సవ కార్యక్రమాల్లో సికింద్రాబాద్ లోక్ సభ తెరాస ఇంచార్జ్, సీనియర్ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్, కార్పొరేటర్ కురుమ హేమలత లక్ష్మీపతి లు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయాల్లో శోభయాత్రలు నిర్వహించగా,వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్ కుమార్, సాయి, మహేశ్, మురళీ, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నంలో...**

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా హనుమాన్ జయంతి పుట్టిన రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. వర్ష కొండ గ్రామంలోని పురాతన ఆంజనేయ స్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో అర్చకులు దోమకొండ ప్రవీణ్, మధుర రామ్, గ్రామ సర్పంచ్ దొంతుల శ్యామల తుకారాం, ఉప సర్పంచ్ మంగిలి పెల్లి లక్ష్మణ్, ఎంపీటీసీ పొన్నికంటి చిన్న వెంకటి, గ్రామ కమిటీ సభ్యులు మరియు గ్రామ భక్తులు పాల్గొన్నారు.

**కోరుట్ల టౌన్ లో.....**

పట్టణంలోని వివిధ హనుమాన్, శ్రీరామాలయాల్లో శనివారం హనుమాన్ జన్మదిన ఉత్సవ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రామ్ నగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జన్మదిన ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పూజారుల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి సుప్రభాత సేవ, పంచామృ తాభిషేకం, అలంకార సేవ, మహానైవేద్యాలు సమర్పించి హనుమాన్ చాలీసా పారాయణం, ఆంజనేయస్వామికి శ్రీమన్యుసూక్త సహిత అభిషేకం, నాగవల్లి, పూజనీరాజన మంత్రపుష్పాలు చేశారు. ఆలయ ఆవరణలో హెూమం నిర్వహించారు. వార్డ్ కౌన్సిలర్ మాడవేని నరేష్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి 15 తులాల వెండి నాగశేషు, లింగ విగ్రహన్ని కానుకగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నపూజ చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ మాడవేని నరేష్, ఆలయ నిర్వాహకులు కమిటీ సభ్యులు బందారి చిన్న సత్తన్న, గాలి చంద్ర శేఖర్, సంతోష్, మాడవేని సురేష్, లంకదాసరి దేవదాసు, జగదీష్, బెజ్జారపు ప్రసాద్, వేసు శ్రీనివాస్, ఆంజనేయ స్వామి దీక్ష పరులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**కథలాపూర్ లో......**

కథలాపూర్ మండలం లోని వివిధ గ్రామాల్లో హనుమాన్ జన్మదిన ఉత్సవాలు కన్నుల పండువగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలో గల గుంటి పెరుమాండ్లు ఆలయం,సిరికొండ పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం, చింతకుంట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జన్మదిన ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు వేద పండితులు, అర్చకులు లోకకల్యాణాన్ని కాం క్షిస్తూ సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామికి అభిషేకం, పూజనీరాజన మంత్రపుష్పాలు,పారాయణం నిర్వహించారు. ఎస్.ఐ. రజిత గుంటి పెరుమాండ్లు ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్.ఐ. రజిత కు శాలువా కప్పి



ఘనంగా సన్మానించారు. అనంతరం అన్న పూజచేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, హనుమాన్ దీక్ష పరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**గొల్లపల్లి లో.......**

గొల్లపెల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో చిన్న హనుమాన్ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా హనుమాన్ దీక్షాపరులు, భక్తులు అంజన్న నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, హనుమాన్ దీక్షాపరులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**రుద్రంగిలో......**

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రుద్రంగి మండలం మానాల గ్రామంలో హనుమాన్ ఆలయంలో భక్తులు, హనుమాన్ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారి మూల విరాట్టుకు సింధూరం లేపనం, జిల్లేడు పూల దండలు, తమలపాకు, వడ దండలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉత్సవ మూర్తికి భక్తులు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అర్చకులు పూర్ణ చందర్ శర్మ, మారుతీ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి దీక్ష పరులు సామూహిక చాలీసా దండకం పారాయణం గావించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

**జనగామలో........**

జనగామ బాణపురం ఆంజనేయ స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా హనుమాన్ జన్మదినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.












ఇందులో స్వామి వారికి పంచామృతంతో అభిషేకం, పండ్లరసాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ఘట్టం హనుమాన్ జెండాను ఎగరవేసారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీ విజయ్ కుమార్ బజాజ్, కృష్ణ జీవన్ బజాజ్, పంకజ్ బజాజ్, గీతేష్ బజాజ్, వినోద్ బజాజ్, దీపక్ బజాజ్, గోపాల్ లోహియా పాల్గొన్నారు.

**చిగురుమామిడి మండల ఇందుర్తి గ్రామంలో.....**

హనుమాన్ చిన్న జయంతిని పురస్కరించుకుని ఉదయం నుండి పూజలు ఘనంగా జరిగాయి. శనివారం హనుమాన్ దేవాలయం జయంతి వేడుకల కోసం ముస్తాబు చేశారు. తెల్లవారుజాము నుండే భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. జయంతిని పురస్కరించుకొని స్వామివారికి సుప్రభాత సేవ అభిషేకం తో పాటు 108 చాలీసా గురుస్వామి అనగొని శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాలీసా పారాయణం హనుమాన్ భక్తులు ఘనంగా జరిపారు. వేదపండితులు గుజరాజన్న శర్మ కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయా%శీ% కిక్కిరిసిపోయాయి. ఉదయాన్నే హనుమాన్ భక్తులతో పాటు గ్రామ సర్పంచ్ స్వరూప పెద్ద స్వామి ఉప సర్పంచ్ తోట సతీష్ పొన్నం శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుండి మహా అన్నదానం సాయంకాలం వరకు నిర్వహించారు సాయంకాలం స్వామివారి శోభయాత్ర గ్రామంలోని నలుమూలల నుండి డీజే పాటలతో భజనలతో హనుమంతుని వేషధారణలతో ఆటపాటలతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమాన్ జయంతి ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి కూన సంతోష్ నేదునూరి సంపత్ విష్ణు అప్పాల సమ్మయ్య సుధగోని శ్రీనివాస్ కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బందెల శ్రీనివాస్, పుల్లూరి శ్రీను, డా. శ్రీను, కుట్ల శ్రీను, సంపత్, భీమర లక్ష్మణ్, సొన్నాయిల భరత్, బుర్ర కిరణ్, శేఖర్, ప్రశాంత్, రాజు, శ్రీశైలం, హనుమాన్ స్వాములు, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# నిరుద్యోగ భారతం... మోడీ భిక్ష!

దేశంలో నిరుద్యోగం 45 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. ఎనిమిదేళ్ల పదవీ కాలంలో చేతగాని నిర్ణయాలు తీసుకుని దేశప్రజలను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తుడుముకోవడం బిజెపికి అలవాటుగా మారింది. సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఎందుకంటే విలువలు కలిగిన నేతలను పార్టీలో దూరంగా పెట్టారు. కనీసం వారికి మర్యాద ఇచ్చి మాట్లాడే స్థితిలో కూడా లేరు. అందుకే పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవలం ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ ప్రజల ఉసురు పోసుకుంటున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. పెద్దనోట్ల రద్దు నిర్ణయం లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు పెద్దనోట్ల రద్దు వల్ల కలిగిన విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోలేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం



లేదు. పాలనలో కొత్త ఒరవడి తీసుకుని వచ్చి,ప్రజలకు ఆసరాగా అండగా, దేశానికి మంచి చేసేలా చేస్తారని మోడీని నమ్మిన ప్రజలు నిజంగానే మోసపోయారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. దీనిపై బిజెపి పెద్దలు ఆత్మవిమర్శ చేసుకుంటే పార్టీకి, దేశానికి మంచిది. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. పెద్దనోట్లను రద్దు చేస్తూ 2016 నవంబరులో కేంద్ర సర్కారు నిర్ణయం తీసుకున్న తర్వాత అవి ఎలా సన్నగిల్లాయో తెలిపినా పట్టించు కోవడం లేదు. తీవ్రమైన ఉపాధి లేమి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీస్తుందన్నది చాలామంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. స్వతంత్ర సంస్థల నోరుకట్టేసి, ప్రభుత్వ సంస్థల నివేదికలను దాచేసి, పెద్దనోట్ల రద్దు నిర్ణయంతో ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకోవడం అవివేకం. పెద్దనోట్ల రద్దు కారణం గానే ఈ దేశంలోని యువతీయువకులకు కొత్త ఇల్లు చవుకగా సమకూరు తున్నదని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో గొప్పలకు పోయారు. కానీ, ఈ నిర్ణయం నల్లధనాన్ని తవ్వితీయ డమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. అప్పట్లో ఆయన నోట అభివృద్ధి మాట తప్ప రామమందిరం ఊసు వినపడలేదు. తన అపసవ్య, అర్థంలేని నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారు. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతు ల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాల సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతు న్నారు. గత 45 ఏళ్ళ కాలంలో ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ ఓ క్రూరమైన జోక్‌గా మిగిలిపోయింది. పెద్దనోట్ల రద్దుతో కోటికిపైగా ఉద్యోగ, ఉపాధులు దెబ్బ తిన్నాయనీ, ఇప్పటికీ దాని ప్రభావం తీవ్రంగానే ఉన్నదని కొన్ని సర్వేలు చెబుతూనే ఉన్నాయి. అయినా మోడీ దేనికి జంకకుండా తన కార్యాచరణతోనే ముందుకు సాగుతున్నారు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్.

# అమ్మమ్మగారిల్లు

ఇది 2060 వ సంవత్సరం చల్లని వేసవి కాలం(వాతావరణ మార్పులు), సాయంత్రం వేల పిల్లలందరూ ఇంట్లో వీడియో గేమ్స్ ఆడుకునే రోజులు, బడులకు సెలవులు ప్రకటించారు, అందరూ పట్టణంలో వున్నా వారి అమ్మమ్మ ఇంటికి వచ్చారు, తెలుసుగా వేసవి సెలవులు అమ్మమ్మ ఇల్లు అంటే ఎలా ఉంటుందో, స్విగిలో, జొమాటో లో ఆర్డర్ చేసిపెట్టే రకరకాల వంటలు, తెర ముందు కూర్చొనే అన్ని ఆటలు ఆడేయచ్చు, అన్ని ఆటలు చూసేయచ్చు, ఇగ సాయంత్రం అలా గాలి కావాలంటే బాల్కనీలో ఉన్న ఆ గింతంతా గడ్డి, దాని పై కుండీలో పెరిగే చెట్లు అబ్బా ఎంత అహ్లాదాన్ని ఇస్తాయో, చల్లని గాలి కావాలంటే ఏ / సి ఆన్ చేస్తే సరిపోయే, కానీ ఇదే పని ఎన్ని రోజులు అని చేస్తారు, చూస్తారు. అందుకే బుజ్జికి బబ్లీకి చిరాకొచ్చించింది . వాళ్ళ అమ్మమ్మ దెగ్గరకువెళ్లి మాకు ఏమైనా స్టోరీస్ చెప్పండి అమ్మమ్మ అని అడిగారు. వాళ్ళ అమ్మమ్మ ఇలా అన్నారు " నాకు మీరు నచ్చే విదంగా వర్చ్యువల్ కథలు చెప్పడం రాదురా, మీకు నచ్చవు, నేను



చెప్పను పోండిర " అంది, కానీ బుజ్జి బబ్లీ పర్లేదు అమ్మమ్మ మాకు వర్చ్యువల్ కథలు వద్దు, రియాలిటీ కి దెగ్గరగా ఉండే కథలే చెప్పండి అని అన్నారు. సరే అని అమ్మమ్మ మొదలెట్టింది, " మా వేసవికాలం సెలవుల్లో మేము ఎలా ఉండేవాల్లం ఎలా గడిపేవాళ్ళమో చెప్తా వినండి " అంది . అది 2008 వ సంవత్సరం నాకు పది సంవత్సరాలు, మా బడులకి కూడా వేసవి సెలవలు ఇచ్చే రోజులు దెగరపడ్డాయి, ఇప్పటి వరికి చదివింది మర్చిపోవద్దు అని బండెడు హోమ్ వర్క్ కూడా రెడీగ పెట్టారు మా మాస్టర్లు, పరీక్షలు రాసాం, ప్రోగ్రెస్ రిపోర్ట్ కోసం ఒక వారం ఆగితే చాలు, మనం పాస్ ఆ ఫెయిల్ ఆ అనేదికూడా చెప్పేస్తారు, స్కూల్కి మా అమ్మ తో కలిసి వెళ్లి రిపోర్ట్ తెచ్చుకున్న, ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యాను,అంతే ఈ వారం రోజుల్లో వచ్చే రెండు నెలల సెలవులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని మొత్తం హోమ్ వర్క్ కూడా చేసేసాను, ఇగ బండి కట్టుడే మా అమ్మమ్మ వాళ ఇంటికి పోవుడే, అని చెప్పింది. మా అమ్మ, మా ఇద్దరక్కలు బస్సు ఎక్కినం, అమ్మమ్మ వీరి రాకకోసం సంక్రాంతి అయిపోయినపుడు నుండే ఎదురుచూస్తుంది, ఇంట్లో అమ్మమ్మ ని తాతయ్యని ఒకసారి చూసి పలకరించారు, ఇగ ఆ తరువాత బయటకి గంతేస్తే మల్లా సాయంత్రం వరికి కనపడేదేలే, పాపం బబ్లీకి బుజ్జికి ఎం అర్ధం అవ్వడంలేదు, ఎక్కడికి వెళ్లారు ఇంటిని వదిలిఅని ఇగ అమ్మమ్మ ఇలా అంది " ఇదేరా మీకు మాకు వున్న వ్యత్యాసం, మీకు ఇంట్లోనే ఆట పాట, మాకు ఇంట్లో తప్పితే ఊరంతా ఆటలే, పాటలే", బుజ్జిగాడు ఎంతో ఆసక్తిగా ఎం చేస్తారమ్మామ్మ అని అడిగాడు, వినురా మనవడా అని అంది అమ్మమ్మ," ముందుగా మామిడి తోటలో కాసిన మామిడికాయలను దొంగతనం చేసి ఉప్పు కారం పెట్టుకొని పొట్ట నిండుగా మనసునిండుగా తిన్నాక, దొంగలే దొంగా పోలీస్ ఆట ఆడుతాం అలా అలా మధ్యానం వరికి ఆడుకొని, ఎవరింటికి వారు ఎల్లిపోతాం, తిని కొద్దిసేపు అష్ట చెమ్మ, పావుపటం, ఇంట్లోనే ఆడుకొని పడుకుంటాం, ఇగ కొంచం సాయంత్రం అవుతుంది అన్న వేళకి ఐస్ తాత గంటకొట్టుకుంటూ వస్తాడు.

ఆయా సప్పిడికి పిల్లలందరికీ మెలుకువ వచ్చేస్తది, ఐస్ కావాలని అందరు పెద్దల దెగ్గర గోల చేస్తారు, ఐస్ ఇప్పిస్తారు, అదితిన్నాక మల్ల ఏదో ఒక ఆట మొదలుపెడతాం చార్ కోన్ అని, తొక్కుడుబిళ్ల, క్రికెట్, కోతికొమ్మచ్చి ఐస్ వాటర్, లండన్ లండన్ స్టాప్, అబ్బో ఇలా చెప్పుకుంటూ పోవచ్చు, హ హ హ హ", అని అమ్మమ్మ నవ్వింది. మరి ఆ తరువాత అని పిల్లలు అడిగారు. అమ్మమ్మ ముసి ముసి నవ్వుల్తో మల్లి మొదలుపెట్టింది " ఈ ఆటలు అయ్యాక చీకటి పడ్డాక, ఇంటికి పోయి స్నానం చేసి, డెర్మి కూల్ పౌడర్ రాసుకొని, ఏడున్నర కల్ల ఒక ముద్ద తిని మల్లా కలుస్తాం, మా ఇంటి డాబా మీదకి పోయి కొన్ని పాటలు, మరి కొన్ని మాటలు మాట్లడుకుంటాం, ఇలా ఎపుడు సోయి తప్పి పాడుకుంటామో మాకే తెలీదు " అని అన్నది అమ్మమ్మ, వావ్ సూపర్ గ్రాన్నీ అని అన్నాడు పిల్లలిద్దరూ, నెక్స్ట్ డే ఎం చేస్తారు అమ్మమ్మ మల్లి అని అడగగా, ఇదే బుజ్జి బబ్లీ, మామిడికాయలు అన్ని అయిపోయేదాకా, తెచ్చుకున్న డెర్మి కూల్ పౌడర్ అయిపోయేదాకా, ఇచ్చిన సెలవులు అయేదాకా ఇదే తంతు.

ఇగఅమ్మాయిలకి అయితే వల్ల అమ్మలు అమ్మమ్మలు ఇంట్లో పనులు నేర్పించడానికి ఇదే చక్కటి సమయం, సైకిలు నేర్చుకుంటాం, ఈతలు నేర్చుకుంటాం, మరెన్నో జ్ఞాపకాలను ఆసంచుల్లో మూటకట్టుకొని మళ్లొచ్చే వేసవి సెలవుల దాకా నెమరేసుకుంటాం, మేము పట్టణంకి తిరిగి వెళ్ళేటపుడు కొత్త పెళ్లి కూతురు వెళ్తుంటే ఏడుస్తారుగా ఆలాగే ఏడ్చే వాల్లం అందరం. కానీ ఏముంది ఇట్టే సంవత్సరం గడిచేది, మల్లా సెలవులకు ఇదే తంతు ... అని అంది అమ్మమ్మ ఆనందభాష్పాలతో, అమ్మమ్మను చూసి కథ విని పిల్లలు కూడా ముగ్దులయ్యారు, ఎలాగైనా వచ్చే సంవత్సరం వాళ్ల వేసవి సెలవులను కూడా ఇలా పట్టణంలో కాకుండా పల్లెలో జరిగేలా చూడుమని అమ్మమ్మ ని బతిమిలీలాడారు పిల్లలిద్దరు, ఇది చూసి అమ్మమ్మ ఎంతో సంతోషించింది.

కథ చదివిన మీకు కూడా మీ వేసవి సెలవులు గుర్తుకువచ్చాయా! జీవితంలో ఉన్న వాస్తవాలే కొన్ని కథలుగా మారి వెలుగులోకి వస్తాయి, ఈ జీవితాలు కూడా ఎప్పుడో ఒకసారి కథలుగా మారక తప్పదు.

చురకంటి వినీల రెడ్డి
సూర్యాపేటజి
9063570531.

## దేశంలో అల్లర్లు జరుగుతుంటే ప్రధాని మౌనమా

### ప్రతిపక్ష పార్టీల సంతకాలతో లేఖ విడుదల

న్యూఢిల్లీ,ఏప్రిల్16: దేశంలో ఈమధ్యకాలంలో నెలకొన్న పరిస్థితులపై, చోటు చేసుకుంటున్న వరుస ఉదంతాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉండడంపై విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. శ్రీరామ నవమి సందర్భంగా చోటుచేసుకున్న మత ఘర్షణలను హైలైట్ చేస్తూ.. మొత్తం 13 ప్రతిపక్ష పార్టీలు శనివారం రోజున సంతకాల సేకరణ ద్వారా ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. తారతమ్యాలకు, రాగద్వేషాలకు తావులేకుండా దేశం మొత్తం శాంతి నెలకొనాలని ఆకాంక్షించిన ఆ పార్టీలు.. మత హింసకు కారణమైనవాళ్లను వదలకూడదని, కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశాయి. ఇదిలా ఉండగా.. ఈ ఘర్షణలపై ప్రధాని మోదీ మౌనంగా ఉండడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించారు.

ప్రధాని మోదీ మౌనంగా ఉండడం దిగ్భ్రాంతి కలిగించిందని ఆ సంయుక్త ప్రకటనలో ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. మతోన్మాదాన్ని ప్రచారం చేసే వాళ్ల మాటలను, వాళ్ల చర్యలను ఖండించడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారు. ఆయన మౌనం.. ఇటువంటి ప్రైవేట్ సాయుధ గుంపులను అధికారికంగా ప్రోత్సాహించినట్లే అవుతుందని, వాళ్లు సంఘంలో విలాసాల్ని అనుభవిస్తున్నారనడానికి ఒక స్పష్టమైన సాక్ష్యంగా నిలిచిందని ఆరోపించాయి. తినేతిండి, కట్టుకునే బట్ట, వాళ్ల వాళ్ల విశ్వాసాలు, పండుగలు, భాషకు..ఇలాంటి విషయాలను పాలక వ్యవస్థలోని వర్గాలు.. మన సమాజాన్ని ధ్రువీకరించడానికి ఉద్దేశపూర్వకంగా ఉపయోగిస్తున్నతీరుపై చింతిస్తున్నాం. దేశంలో విద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించిన సంఘటనలు పెరిగిపోతున్నాయి. అధికారమనే అండతో రెచ్చిపోతున్నారు. అలాంటి వాళ్లపై అర్థవంతమైన, బలమైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆందోళన చెందుతున్నాం అని ఆ సంయుక్త ప్రకటన పేర్కొంది. హిజాబ్, హిందీ భాష, తిండిపై ఆంక్షలు, మత ఘర్షణలు.. ఇలా ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా ఉన్న అంశాలపైనే ఈ పార్టీలు, ప్రధాని మోదీని నిలదీసినట్లు అర్థమవుతోంది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ, సీపీఐ(ఎం), డీఎంకే, ఆర్జేడీతో పాటు మరికొన్ని ఈ సంయుక్త ప్రకటనలో సంతకాలు చేశాయి. అయితే.. శివసేన, ఆమ్‌ఆద్మీ పార్టీ మాత్రం ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం.

# పరమ పవిత్రం.... పునరుత్థాన దినం

ఈస్టర్ పండగ క్రైస్తవులకు పరమ పవిత్ర దినం. ఈస్టర్ ఆదివారం, ఏప్రిల్ 17, 2022న జరుపుకుంటారు. పరమ పవిత్ర బైబిల్ సంబంధిత కొత్త నిబంధన లో పేర్కొన్న ప్రకారం కల్వరి గిరి లో యేసు ప్రభువును రోమనులు శిలువ వేసి హత మార్చగా, ఖననానంతారం, మూడవ రోజున నిర్జీవితుడైన క్రీస్తు పునరుత్థానం చెందిన పవిత్ర దినాన్ని క్రైస్తవులు ఈస్టర్ పర్వ దినంగా జరుపుకుంటారు. ఈ దినాన్ని దేవుని ఎంతో అద్భుతమైన పుణ్య దినంగా భావిస్తారు. 40 రోజులపాటు ఉపవాస దీక్షలు ప్రార్థనలు, ప్రాయశ్చిత్తం ఆచరించిన సందర్భంగా జీసస్ అభిరుచికి ఉన్నత స్థితిగా పరాకాష్టగా భావిస్తారు...పునరుత్థానము/ పునరుద్ధానం అనగా క్రైస్తవ పరిభాషలో మరణించిన తర్వాత ఆత్మ రూపంలో తిరిగి లేవడం.

పునరుత్థానాన్ని మరణంపై యేసు ప్రభువు గెలిచిన విజయోత్సవంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగ జరుపుకుంటారు. ఈస్టర్ అనే పేరు పునర్జన్మ దేవత అయిన ఈస్టారా నుండి వచ్చిందని విశ్వసిస్తారు. ఈస్టర్ పర్వదినాన్ని ఆచరించే ఆదివారానికి ముందు వారాన్ని పవిత్రవారంగా పరిగణిస్తారు.. క్రైస్తవులకు కు ఇది అతి పెద్ద పండుగ. ఈ పండుగ వసంత ఋతువులో వస్తుంది. ప్రధానంగా ఈస్టర్ త్రి దినాలను.... మౌండే, థ ర్స్ డే, గుడ్ ఫ్రైడే, హోలీ సాటర్ డే గా జరుపుకుంటారు. క్రిస్మస్ లాగా ఈస్టర్ పండుగ ప్రతి సంవత్సరం ఒకే తేదీన రాదు. సమరాత్రి అనంతరం, 21వ తేదీ తర్వాత పౌర్ణమి అనంతరం వచ్చే తొలి ఆదివారం నాడు ఈ పండుగ జరుపు కోడానికి నిర్ణయిస్తారు.

ఏసుప్రభు పరమ పదించిన అనంతరం, ఆయన అనుయాయులు, నిరాశ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్న పరిస్థితిని చూడలేక ఏసు ప్రభువు తిరిగి వారి కోసం పునర్జీవితుడయ్యాడని, తిరిగి వచ్చారని కథనం. క్రీస్తు విశ్వసనీయ అనుయాయులు అందరూ ఉదాసీనులై ఉన్న సమయంలో, ఓ స్త్రీ వారి వద్దకు వచ్చి ఆశ్చర్య చకితులను చేసిన, అనంతరం వారు ఏసు మృతదేహంపై నీళ్లు చల్లడానికి, సమాధి వద్దకు వెళ్లగా సమాధి పై భాగం తెరవబడి ఉండడాన్ని, అందులో ఇద్దరు ధవళ వస్త్ర దారులైన దేవదూతలు ఉండడాన్ని గమనించారు. ప్రస్ఫుట కాంతి ముఖా లతో ఉన్న ఆ దేవదూతలు... ఏసు ప్రాణాలతో బయట పడినారని వివరించారు. ఆ సమాధి వద్ద కూర్చుని ఏడుస్తున్న మగ్దలేనా, ఈ విషయాన్ని విశ్వసించని స్థితిలో ఆమె ఏసు గొంతు వినడం జరిగింది. ప్రభువును తొలిసారి చూసింది.

తాను పునరుజ్జీవం పొందిన ఈ విషయాన్ని తన అనుయాయులకు చెప్పమని క్రీస్తు కోరిన ఈ క్రమంలో మగ్దలేనా ఆ సందేశాన్ని ప్రభువు నుండి తీసుకొని అనుచరులకు వినిపించింది. ఈ సందర్భాన్ని క్రైస్తవులు ఈస్టర్ పండుగలా జరుపుకుంటారు. క్రైస్తవులు ఈస్టర్‌ను వ్యక్తిగతంగా మరియు సార్వత్రికంగా పాటిస్తారు. పునరుత్థానం ద్వారా తననుసరించిన కుంటారు. ఈస్టర్ ప్రకటనను పఠించడం, పాత నిబంధన చదవడం, కీర్తనలు పాడడం, ఈస్టర్ దే శుభాకాంక్షలు చెప్పడం వేడుకలలో భాగాలు. ఫిలిప్పీన్స్ మరియు స్పెయిన్ వంటి కొన్ని దేశాలలో ఈస్టర్ ఊరేగింపులు జరుగుతాయి. చాలా మంది క్రైస్తవులు ఈస్టర్‌ను గొప్ప పండుగగా భావిస్తారు. క్రైస్తవ విశ్వాసం ప్రకారం, యేసుక్రీస్తు పునరుత్థానమయ్యాడని గుర్తుచేసుకోవడానికి జరుపుకునే వేడుకల రోజు.




వారికి మరణం తర్వాత నిత్య జీవముందనే విషయాన్ని తెలియజెప్పాడు క్రీస్తు. జర్మనీ భాషలో ""ఈ ఓస్టర్"" అంటారు. అంటే దీని అర్థం ""దేవి" అని. ఈ దేవిని వసంత దేవిగా పిలుస్తారు. ఈస్టర్ పండగను క్రిస్మస్ లాగా ఘనంగా జరుపుకోకున్నా, పవిత్రంగా, ఉత్తమంగా, సాంప్రదాయ రీతిలో జరుపుకుంటారు. క్రైస్తవ విశ్వాసం ఉన్నవారు మతపరమైన ఆచారాలు, జాగరణలు, చర్చికి వెళ్లడం ద్వారా ఈస్టర్‌ను పాటిస్తారు, సంప్రదాయాల ప్రకారం, ఆదివారం ఉదయం చర్చి వెలుపల కొత్త మంటను వెలిగించి, ఈస్టర్ జాగరణలో పాల్గొనడం ద్వారా ఈస్టర్ ఆదివారం జరుపుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది క్రైస్తవులు ప్రత్యేక చర్చి సేవలు, సంగీతం, క్యాండిల్ లైట్, పువ్వులు, చర్చి గంటలు మోగించడంతో ఈస్టర్‌ను జరుపు



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

## కాంగ్రెస్‌లో హిందుత్వ ఎజెండా కోసం కసరత్తు

న్యూఢిల్లీ,ఏప్రిల్16 : త్వరలో జరిగే కొన్ని రాష్ట్రాల ఎన్నికలతో పాటు, 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్ గాంధీని హిందుత్వ అనుకూలవాదిగా సిద్ధం చేయాలని కాంగ్రెస్ ప్లాన్ వేస్తోంది. మోడీని ఢీకొనాలంటే అధికశాంత ఉన్న హిందువుల ఓట్లు ఆకట్టుకోవాలి. అందుకే ఇటీవల హిందూ అనుకూల విషయాల్లో కొంత సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. ప్రియాంక కూడా యూపి ఎన్నికల్లో ఇలాగే చేసినా ఫలితం రాబట్టలేకపోయారు. రాహుల్ హిందుత్వవాది అనిపించుకోవాలని పక్కాగా ప్లాన్ వేసినట్లు కాంగ్రెస్ నేతల ద్వారా వెల్లడవుతోంది. ఇటీవల ఫలితాలను బేరీజు వేసుకున్నాక కొంత హిందుత్వ విషయంలో రాహుల్ కూడా ఆలోచన చేస్తున్నట్లుగా క్షేత్రస్థాయికి సమాచారం చేరవేస్తున్నారు. బిజెపిని ఢీకొని అధికారంలోకి రావాలంటే జాతరల్లో ఓట్లను పట్టాలని చూస్తున్నారు. హిందుత్వ ఓట్లు నిజంగానే గంపగుత్తగా బిజెపికి పడివుంటే ఈ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది కాదు. కానీ ముస్లిం సంతుష్టీకరణపై మాత్రం హిందువుల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ హయాంలో అనేక సందర్భాల్లో ముస్లింల కోసం కాంగ్రెస్ గీతదాటింది. ఎన్నికల సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బిజెపిని మించి హిందుత్వాన్ని ప్రదర్శించాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే రాహుల్‌ను మోడీని మించిన హిందుత్వవాదిగా తయారు చేయాలని చూస్తున్నారు. ఇదిసానుకూల ఫలితం ఇస్తుందా లేదా అన్నది పక్కన పెడితే అసలుకే ఎసరు పెట్టవచ్చు. ఈ ప్రమాదాన్ని గుర్తించకుంటే రాహుల్ రాజకీయ జీవితమే ప్రమాదంలో పడగలదు. నిజానికి దేశానికి ఇప్పుడు ఏం కావాలి... మనం ఏం తప్పులు చేశాం... ఏం చేయలేకపోయాం... గతలో పదేళ్లు ప్రజలు అధికారం కట్టబెడితే ఎందుకు దేశాన్ని సక్రమంగా పాలించలేక పోయాం అన్న ఆత్మపరిశీలనతో ముందుకు వెళితే తప్ప కాంగ్రెస్ మనుగడ సాధించడం కష్టం. కేవలం గుళ్లూగోపురాలు తిరిగితే ప్రజలు ఓట్లు వేస్తారనుకుంటే పొరపాటు. అలా అనుకుంటే దివంగత పివి నరసింహారావు హయాంలో అయోధ్యలో వివాదాస్పద మసీదు కూల్చివేత తరవాత కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. హిందువులు ఈ విషయంలో పివిని ఆదర్శంగా తీసుకుని, హిందువులకు అతనే ప్రతినిధి అని అనుకుని ఉంటే భారీ మెజార్టీతో మళ్లీ గెలిపించే వారు. కానీ అలా జరగలేదు. దేశంలో బీజేపీ క్రమక్రమంగా ఎదుగుతున్న వైనాన్ని మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు గమనించినందువల్లనే బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో ఉదాసీనతతో వ్యవహరించారని, ఆయన వల్లే మైనారిటీలు దూరం అయ్యారని కాంగ్రెస్‌లో ఒక వర్గం ఆనాడు భావించింది. అందుకే తరవాత పివిని దూరం పెడుతూ వచ్చారు. అర్జున్ సింగ్ వంటి నేతలు పి.వి. నరసింహారావు అనుసరించిన హిందూత్వ విధానాలపై లేఖాస్త్రాలు సంధించి ఇరుకున పెడుతూ ఉండేవారు. మాధవరావు సింధియా, చిదంబరం తదితర నేతలు పివిని తక్కువ చేసి చూశారు. పి.వి. హయాంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉన్న గాడ్గిల్ కాంగ్రెస్ రోజురోజుకూ క్షీణించిపోవడానికి కారణం ముస్లింలను బుజ్జగించే ప్రయత్నాలు చేయడమేనని చెప్పేవారు. సోనియా హయంలో రెండు పర్యాయాలు అధికారం అనుభవించాక ఇంతగా దిగజారి పోవడం ఇదే ప్రథమం. అలాగే రాహుల్ పట్టాభి షిక్తుడు అయ్యాక ఇప్పుడు సహజంగానే ఓటమి భయం వెన్నాడుతుంటుంది. అందుకే కొందరు రాహుల్‌ను హిందూ ప్రతినిధిగా ప్రజలు గుర్తించేలా చేయాలని తపాత్రయపడుతున్నట్లుగా ఉంది. రాహుల్ గుళ్లూ గోపురాలు తిరగడం వల్లనే మూడురాష్ట్రాలు దక్కాయని వాదిస్తున్న వారు ఉన్నారు. సోనియా స్వతహాగా క్రిష్టియన్ కావడం, విదేశీ వనిత కావడం వల్ల ఇంతకాలం ఆమె హిందుత్వను అంగీకరించి ఉండకపోయి ఉంటారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తుంది.. ఏం చేయలేక పోయాం అన్న సిద్దాంతాన్ని పక్కన పెట్టి ముందుకు వెళ్లడం అన్నది సైద్ధాంతిక దిగజారుడు తనంగానే చూడాలి. 2014లో నరేంద్ర మోదీ హయాంలో బీజేపీ ప్రభంజనం వీచిన తర్వాత నుంచీ కాంగ్రెస్‌లో ఈ మేరకు అంతర్మథనం ప్రారంభమైనట్లు సంకేతాలు కనపడుతున్నాయి. అప్పటివరకూ మైనారిటీల మద్దతు పొందేందుకు ఎటువంటి చర్యకైనా పూనుకునే దిగ్విజయ్ సింగ్ వంటి కాంగ్రెస్ నేతల వల్ల తమకు నష్టమే కాని లాభం లేదని కాంగ్రెస్ అధిష్ఠానం భావించే స్థితికి చేరుకుంది.

# పంజాబ్ ప్రజలకు ఆప్ శుభవార్త

## ఇంటికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుతు హామీ

చండీగఢ్,ఏప్రిల్16: పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు శుభవార్తనందించింది. జూలై 1నుంచి ప్రతి ఇంటికి 300 యూనిట్ల వరకు కరెంట్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. పంజాబ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నేతృత్వంలోని ప్రభుత్వం.. నెల రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ భారీ ప్రకటన చేసింది. ఈనెల 16న పంజాబ్ ప్రజలకు శుభవార్త అందించనున్నట్లు సీఎం భగవంత్ మాన్ ఇటీవల ప్రకటించారు. అదే విధంగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో సమావేశమమై దీనిపై చర్చించినట్లు సీఎం తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం కోసం ఇప్పుడు మీరు అయిదేళ్లు వేచి ఉండాల్సిన అవసరం లేదు.. పంజాబ్ ప్రజలు రేపు పెద్ద ప్రకటన వినబోతున్నారని ఆప్ ట్వీట్ చేసింది. అయితే ఢిల్లీలోని ఆప్ సర్కార్ కూడా నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తోంది. కాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఆప్ ఇచ్చిన హామీల్లో.. ప్రతి ఇంటికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు కూడా ఒకటి. అధికారంలోకి వచ్చిన నెలలోనే ఇచ్చిన హామీని నెలబెట్టుకుంది ఆప్ సర్కార్. ఇప్పటికే పంజాబ్ ప్రభుత్వం రైతులకు ఉచిత కరెంటు ఇస్తోంది. ఇటీవల జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 117 అసెంబ్లీ స్థానాలకు గానూ ఆప్ 92 చోట్ల విజయకేతనాన్ని ఎగరవేసింది.

## జిల్లకు అక్రమంగా ధాన్యం రాకుండా కట్టడి

నిర్మల్,ఏప్రిల్16: జిల్లా కొనుగోలు కేంద్రాలకు అక్రమంగా అక్కడి ధాన్యం రాకుండా అడ్డుకునేందుకు పౌర సరఫరాలశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోలీసుశాఖ సహకారంతో జిల్లా వ్యాప్తంగా ఐదుచోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న బెల్‌తరోడా చెక్‌పోస్టుతో పాటు కుభీర్, కుంటాల, బిద్రెల్లి, సారంగాపూర్ మండలంలోని సిర్‌పల్లిలలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పకడ్బందీ తనిఖీల అనంతరమే మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే వాహనాలను జిల్లాలోకి అనుమతించనున్నారు. ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. మరో వారంరోజుల్లోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుంది. జిల్లాలో ఇప్పుడిప్పుడే కోతలు మొదలయ్యాయి. మొత్తం ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి మహారాష్ట్ర వైపు నుంచి జిల్లాలోకి వరిధాన్యం రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ శ్రీకళ తెలిపారు. పకడ్బందీగా కొనుగోళ్లుధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ ఉంచేందుకు గిడ్డంగులను అన్వేషిస్తున్నాం. అలాగే అవసరమైన మేరకు గోనే సంచులను సేకరించే దిశగా చర్యలు మొదలయ్యాయి. కొనుగోలు కేంద్రాల నుంచి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. పౌర సరఫరాలశాఖ, వ్యవసాయశాఖతో పాటు పోలీసు శాఖతో సమన్వయంగా వ్యవహరిస్తూ ధాన్యం కొనుగోలు, నిల్వ, ఆ పంటను రైస్‌మిల్లులకు తరలించే ప్రక్రియ దిశగా కూడా ప్రణాళికలు రూపొందించారు. జిల్లావ్యాప్తంగా ఈసారి 196 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 32, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 93, డీసీయంయస్ ఆధ్వర్యంలో 66, డీసీసీ ఆధ్వర్యంలో 5 కొనుగోలుకేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో మొత్తం 62 వేల ఎకరాల్లో ధాన్యాన్ని సాగుచేయగా 1లక్ష 50వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా మొత్తం 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కోసం 38 లక్షల గోనెసంచులు అవసరం కానున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ కూడాఏ ఒక్క గిడ్డంగి కూడా ఖాళీగా లేదంటున్నారు. సౌకర్యాలపై దృష్టిధాన్యం కొనుగోళ్ల కోసం ఏర్పాటు కాబోతున్న 196 కొనుగోలు కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తూకంయంత్రాలు, తేమ కొలిచే యంత్రాలతో పాటు అవసరమైన ప్యాడీక్లీనర్‌లు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుతున్నారు.

## గంగా జమున తహజీబ్ కు నిలయం చల్ గల్ గ్రామము...

.జగిత్యాల ఏప్రిల్ 16 (ప్రజా మంటలు) :
ఒకవైపు హనుమాన్ స్వాముల కొండగట్టు యాత్ర
మరొక వైపు ముస్లీమ్ సోదరుల
రంజాన్ ఉపవాస దీక్షలు...
దారులు వెరైన .....
గమ్యం ఒక్కటే....





హిందు ముస్లిం భాయ్ భాయ్.....
చల్ గల్ గ్రామంలో
ముస్లిమ్ మైనారిటీ సోదరుల ఆధ్వర్యంలో
హనుమాన్ జయంతి సందర్భంగా...
కొండగట్టు కు పాదయాత్ర చేస్తున్న
హనుమాన్ స్వాములకు పండ్లు మరియు
చల్లని మంచి నీరు అందించిన
మదీన వెల్ఫేర్ యూత్ అసోషియేషన్
ఈ కార్యక్రమంలో
సామాజిక సేవకులు
మదీన ఫౌండర్ ప్రెసిడెంట్
మహమ్మద్ బాబూజన్
అభిద్ సాదిక్ సోహైల్
ఆసీఫ్ గయాజ్ ఇర్ఫాన్ ఆవేజ్
పైజు బాయ్ జావేద్ ఖయ్యూమ్
మరియు మదీన యూత్ సభ్యులు పాల్గొన్నారు

# 27న టీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం

**మొదటిపేజీ తరువాయి..**

పట్టణాల, మండలాల పార్టీ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు హాజరు కానున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పార్టీ ప్రతినిధుల పేర్ల నమోదు కార్యక్రమం కొనసాగనుంది. ఉదయం 11:05 గంటలకు పార్టీ అధ్యక్షులు కేసీఆర్ సభా ప్రాంగణానికి చేరుకుని, పార్టీ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం స్వాగతోపన్యాసం ఉంటుంది. ఆ తర్వాత అధ్యక్షులు కేసీఆర్ మాట్లాడుతారు. దాదాపు 11 తీర్మానాలను ప్రవేశపెట్టనున్నారు. తీర్మానాలను చర్చించి ఆమోదం తెలుపనున్నారు.

# ఎఫ్‌సీఐ బియ్యం కుంభకోణంపై సీబీఐ విచారణ

## కేసీఆర్ అధికార ఉన్మాదిగా మారి దోచుకుంటున్నారు
## మండిపడ్డ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్16: ఎఫ్‌సీఐకి చెందిన బియ్యం మాయమయ్యాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అధికార ఉన్మాదిగా మారి దోచుకుంటున్నారని మండిపడ్డారు. బియ్యం మాయమైన ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ మెడలు వంచి వరి ధాన్యం కొనిపిస్తున్న ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరి వేయక నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలి.. తక్కువధరకు ధాన్యం అమ్ముకున్న రైతులకు రూ.600 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కై రూ.3 వేల కోట్ల కుంభకోణం చేసిందని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఎనిమిదేళ్లుగా సీఎంఆర్ బియ్యం స్కాం జరుగుతుందని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే వానాకాలం పంట సమయంలో లక్ష క్వింటాళ్లు స్కాం జరిగిందంటూ ట్వీట్ చేశారు. ఇక రాష్ట్రంలో స్కాం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చంటూ విమర్శించారు. కేసీఆర్ కి తెలియకుండానే ఈ స్కాం జరుగుతుందా అని రేవంత్ ప్రశ్నించారు. దీనిపై సీబీఐ విచారణకు విచారించకుండా ఆపుతుంది ఎవరంటూ రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పువ్వాడ అజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు.అక్రమ కేసులతో కాంగ్రెస్ కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. నిజాంకు పట్టిన గతే కేసీఆర్‌కు పడుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు.





# ప్రశాంతంగా హనుమాన్ శోభాయాత్ర

## భారీ బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు

హైదరాబాద్,ఏప్రిల్16: హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కర్మన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ నుంచి తాడ్ బండ్ వరకు మొత్తం 21 కిలో మీటర్లు ర్యాలీ సాగగా పోలీసులు భారీ బందోబస్తుతో సాగింది. కరోనా ఎఫెక్ట్ తో రెండేళ్లుగా సిటీలో హనుమాన్ శోభాయాత్ర జరగలేదు. ఈసారి కరోనా తీవ్రత తగ్గడంతో హైదరాబాద్ సిటీ, రాచకొండ కమిషనరేట్ల నుంచి రెండు శోభాయాత్ర ర్యాలీలను నిర్వహిస్తున్నారు. శోభాయాత్రకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 8 వేల మంది పోలీసులు, 550 సీసీ కెమెరాలు, 4 మౌంటెడ్ కెమెరాలు, మఫ్టీ పోలీసులతో నిఘా పెట్టారు. మరోవైపు గౌలిగూడ రామమందిరం నుంచి యాత్ర మొదలై రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్ లోని తాడ్ బండ్ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద శోభాయాత్ర ముగియనుంది. ఇదిలావుంటే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, ఔన్నత్యాన్ని చాటేలా శోభాయాత్ర నిర్వహించడం సంతోషంగా ఉందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బాలానగర్ ఐడీపీఎల్ కాలనీలో హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందూవాహిని ఆధ్వర్యంలో గత 12ఏళ్లుగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నారని ఈటల అన్నారు. జగద్గిరి గుట్ట నుంచి ఐడీపీఎల్ వరకు దాదాపు 12 కిలోమీటర్ల మేర శోభాయాత్ర కొనసాగుతుందని చెప్పారు. మన సంస్కృతి, సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించే గొప్ప కర్తవ్యమే శోభాయాత్ర అని ఈటల అభిప్రాయపడ్డారు. మల్యాల మండలం, ముత్యంపేట్ గ్రామంలోని కొండగట్టులో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ భజనలతో ఆలయం మార్మోగింది. రెండేళ్ల నుంచి కరోనా వల్ల జయంతి ఉత్సవాలకు అనుమతి ఇవ్వలేదు. ఈసారి వైరస్ ఎఫెక్ట్ తగ్గి అనుమతించడంతో భక్తులు భారీగా తరలి వచ్చారు. హనుమాన్ దీక్షదారులు ఇరుముడులు సమర్పించి... మాల విరమణ చేశారు. కొండగట్టు ఆలయానికి భారీగా ఆదాయం వస్తున్నా హనుమాన్ జయంతికి అధికారులు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు భక్తులు. కోనేరులో మురికినీరు ఉండటం వల్ల డబ్బులు ఇచ్చి బయట స్నానాలు చేశామన్నారు. ఆలయ పరిసరాల్లో మాల విరమణ చేసి వదిలేసిన దుస్తులు, చెత్త చేదారం పేరుకు పోయాయన్నారు. విశ్రాంతి గదులు లేకపోవడం ఇబ్బందిగా ఉందన్నారు భక్తులు. కొండగట్టులో కనీస సౌకర్యాలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు హనుమాన్ భక్తులు. ఏటా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

# భారీగా పతనమైన సెన్సెక్స్, నిఫ్టీ

## వారంలో 1100 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్
## 300 పాయింట్లకు పైగా నిఫ్టీ క్షీణత



న్యూఢిల్లీ,ఏప్రిల్16: ఈ వారం స్టాక్ మార్కెట్ భారీగా పడిపోయింది. విదేశీ మార్కెట్ల ప్రతికూల సంకేతాల కారణంగా, ప్రధాన సూచీలు ఈ వారం దాదాపు 2 శాతం నష్టాన్ని నమోదు చేశాయి.వారంలో 3 రోజులు మాత్రమే ట్రేడింగ్ జరగ్గా, మూడు రోజులూ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ద్రవ్యోల్బణం పెరగడం, ఫెడరల్ రిజర్వ్ రేట్లు భారీగా పెరుగుతాయన్న భయాల కారణంగా స్టాక్ మార్కెట్‌లో ఈ వారం పతనం కనిపించింది. ఈ వారం స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో తక్కువగా నష్టాలు వచ్చాయి. అదే సమయంలో, జెయింట్ స్టాక్‌ల కంటే మిడ్‌క్యాప్ స్టాక్‌ల నష్టం ఎక్కువగా ఉంది. వారంలో సెన్సెక్స్ 1100 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ 1.73 శాతం అంటే 300 పాయింట్లకు పైగా క్షీణతతో ముగిసింది. ఏప్రిల్ 13న వారం చివరి ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ 58338 వద్ద, నిఫ్టీ 17475 స్థాయి వద్ద ముగిశాయి. ఈ వారంలో ఈ రంగంలో అత్యధిక ఆదాయాలు విద్యుత్ రంగంలో ఉన్నాయి. బీఎస్ఈ పవర్ ఇండెక్స్ వారంలో 5 శాతానికి పైగా లాభపడింది. ఇదే సమయంలో బీఎస్ఈ ఐటీ సెక్టార్ ఇండెక్స్ 3శాతం, బీఎస్ఈ టెలికాం సెక్టార్ ఇండెక్స్ 3 శాతం పతనంతో ముగిశాయి. కాగా మెటల్ సెక్టార్ ఇండెక్స్ 2శాతం, క్యాపిటల్ గూడ్స్ రంగం 2 శాతం పతనంతో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ వారంలో 2.6 శాతం పడిపోయింది. కాగా లార్జ్ క్యాప్ ఇండెక్స్ 1.3 శాతం క్షీణించింది. స్మాల్‌క్యాప్ స్టాక్‌లు వారంలో మెరుగైన పనితీరు కనబరిచాయి. సూచీ 0.8 శాతం పతనంతో ముగిసింది.మనీ కంట్రోల్ సమాచారం ప్రకారం, ఈ వారం 30కి పైగా స్టాక్‌లలో పెట్టుబడిదారులు 10 నుండి 37 శాతం రాబడిని పొందారు. ఇందులో శివ సిమెంట్, గుజరాత్ అంబుజా ఎక్స్‌పోర్ట్స్, సియారామ్ సిల్క్ మిల్స్, కాంటాబిల్ రిటైల్, గార్డెన్ రిచ్ షిప్ బిల్డర్స్ ఉన్నాయి. అయితే మరోవైపు రిలయన్స్ క్యాపిటల్, తేజస్ నెట్‌వర్క్, రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ నష్టాలను చవిచూశాయి. వారం వ్యవధిలో ఎఫ్ఐఐలు రూ.6,000 కోట్లకు పైగా ఈక్విటీలను విక్రయించారు. ఇదే సమయంలో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు దాదాపు రూ.1800 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఏప్రిల్‌లో ఇప్పటివరకు ఎఫ్ఐఐలు మార్కెట్‌లో 10700 కోట్లను విక్రయించగా, మరోవైపు డీఐఐలు దాదాపు 5800 కోట్లను కొనుగోలు చేశారు.

# ఉద్యోగాల నోటిఫికేషన్లపై ప్రభుత్వం వడివడిగా అడుగులు

## గ్రూపు 2, 3 పోస్టులకు ఒకే నోటిఫికేషన్ ఇవ్వనున్న టీఎస్పీఎస్సీ
## మొత్తం 1955 ఉద్యోగాల భర్తీకి నిర్ణయం
## త్వరలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం



హైదరాబాద్,ఏప్రిల్16: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు త్వరలో వెలువడనున్నాయి. ఐతే అందుకు సంబంధించి ఏయే పోస్టులకు ఎన్ని నోటిఫికేషన్లు ఇవ్వాలనే విషయంలో కసరత్తులు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో గ్రూపు-2 పోస్టులతో పాటు గ్రూపు-3 పోస్టులకు ఒకే నోటిఫికేషన్ ద్వారా జారీకి టీఎస్పీఎస్సీ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు విభాగాల్లో కలిపి 1955 పోస్టులు మాత్రమే ఉన్నందున వీలైనంత త్వరగా భర్తీ చేసేందుకు తాజాగా ఈ ప్రతిపాదనను తెరమీదకు తెచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో భాగంగా 582 గ్రూపు-2 పోస్టులు, 1373 గ్రూపు-3 పోస్టులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో ప్రకటించిన విషయం తెలిసిందే. గ్రూపు-2 పరిధిలో పురపాలక కమిషనర్లు- గ్రేడ్ 3, ఏసీటీవో, సబ్‌రిజిస్ట్రార్- గ్రేడ్ 2, పంచాయతీ విస్తరణాధికారి, ఆబ్కారీ సబ్‌ఇన్‌స్పెక్టర్, నాయబ్ తహసీల్దార్, సహాయ రిజిస్ట్రార్, సచివాలయ సహాయ విభాగాధికారి, సహాయ కార్మిక అధికారి, సహాయ అభివృద్ధి అధికారి తదితర ఉద్యోగాలున్నాయి. గ్రూపు-3లో సీనియర్ అసిస్టెంట్, సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, ఆడిటర్, సహాయ ఆడిటర్, టైపిస్టు వంటి పోస్టులున్నాయి. వీటన్నింటికీ కలిపి నోటిఫికేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రతిపాదనలు రూపొందించి, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తుది అనుమతులు ఇచ్చాక నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది.ప్రభుత్వం భర్తీ చేయనున్న ఉద్యోగాల జాబితాలో 9,168 గ్రూపు-4 పోస్టులున్నాయి. వీటిని టీఎస్పీఎస్సీ ద్వారా భర్తీ చేయాలా? లేక నియామక సంస్థలకు విడివిడిగా ఇవ్వాలా అనేదానిపై స్పష్టత లేదు. దీనిపై ఆయా శాఖల అభిప్రాయాలను ప్రభుత్వం కోరింది. వాటి నివేదికల ఆధారంగా త్వరలో తుది నిర్ణయం తీసుకునే వీలుంది.

## తెలంగాణ అభివృద్ధితో పెరిగిన ఉపాధి, ఉద్యోగాలు

మహబూబాబాద్,ఏప్రిల్16: తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాలతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో, ఐటీ పరిశ్రమలు పురపాలక పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కేటీఆర్ కృషి వల్లనే ఇది సాధ్యమయ్యిందని అన్నారు. దీంతో ఇప్పుడు ప్రపంచం భాగ్యనగరం పైనే ఉందని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన పాల్గొని ఎంపికైన అభ్యర్థులకు మంత్రి నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ, తెలంగాణ ప్రపంచ ఐటీ హబ్ గా మారింది. హైదరాబాద్ విశ్వ నగరంగా ఎదుగుతోందని, ప్రపంచ మేటి పరిశ్రమలు ఇక్కడకు రావడం వల్ల మన రాష్ట్రం లో నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరిగాయని అన్నారు.

# హరితహారంలో అందరూ భాగస్వామ్యం కావాలి

## ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రిఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్16: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారంలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం కావాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సామాజిక స్పృహ ఉండాలనే సంకల్పంతోనే హరిత నిధి ఏర్పాటు జరిగిందని అన్నారు. హరితనిధి పురోగతి, ఆయా శాఖలు తీసుకుంటున్న చర్యలపై అరణ్య భవన్‌లో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.మే నెల నుంచి ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపార, వాణిజ్య వర్గాలు, విద్యార్థులు తమ వంతు విరాళం హరితనిధికి జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పటిదాకా సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై డిపార్ట్‌మెంట్ వారీగా ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు అంతర్గత ఉత్తర్వుల ద్వారా ప్రక్రియ వేగంగా పూర్తి చేసి, మే నెల నుంచి హరితనిధికి నిధులు జమ అయ్యేలా చూడాలన్నారు.పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి అమలు తర్వాత తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల రూపు రేఖలు మారుతున్నాయని, పచ్చదనం- పరిశుభ్రత అవసరాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించారని ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. హరితనిధి ద్వారా సమాజంలోని ప్రతీ ఒక్కరి భాగస్వామ్యంతో మరింత సమర్థవంతంగా పచ్చదనం కార్యక్రమాలను అమలు చేయటం సాధ్యం అవుతుందన్నారు. సమీక్షా సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారి, పీసీసీఎఫ్ / హెచ్ఓఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, రిజిస్ట్రేషన్ల శాఖ ఐ.జీ. వి.శేషాద్రి, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, సీడీఎంఏ కమిషనర్ ఎన్.సత్యనారాయణ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ సెక్రటరీ సయాద్ ఒమర్ జలీల్, ఎక్సయిజ్ శాఖ డైరెక్టర్ సర్ఫరాజ్ అమ్మద్, పాఠశాల విద్యాశాఖ దేవసేన, అటవీశాఖ అడిషనల్ సెక్రటరీ ఎం. ప్రశాంతి, అదనపు పీసీసీఎఫ్ వినయ్ కుమార్, ఎ÷-లానింగ్ శాఖ డైరెక్టర్ పీ.శ్రీరాములు, పంచాయితీ రాజ్, నీటి పారుదల శాఖలతో పాటు, ఇతర సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.





## స్వయంభూ గుండు హనుమాన్ జయంతి

**జగిత్యాల ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని మంచి నీళ్ల బావి వద్ద గల స్వయంభూ గుండు హనుమాన్ జయంతి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉషోదయ వేళ మూలవిరాట్టుకు వివిధ ఫల, పుష్పాదులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని వివిధ రకాల నివేదనలను స్వామివారికి సమర్పించారు. ఉదయం మన్యూ సూక్తంతో అభిషేకించి వివిధ రకాల పుష్పాలతో మూలవిరాట్టు ను అలంకరించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలతోపాటు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్ ఆలయాన్ని సందర్శించి స్వామివారిని అర్చించారు. వీరిని స్వామి వారి శేష వస్త్రాలతో నిర్వాహకులు సత్కరించారు. హనుమాన్ దీక్ష స్వాముల భజనలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.



మాజీ పీసీసీ అధ్యక్షులు మాజీ మంత్రి ఎం. సత్యనారాయణ రావు మొదటి వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య.



జనగామ శ్రీ సంతోషిమాత ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారి శ్రీనివాస్ శర్మ, పూజలో పాల్గొన్న భక్తులు

## అంజన్న భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ

**కొడిమ్యాల ఏప్రిల్ 16 (ప్రజామంటలు)** కొడిమ్యాల మండలం లోని దొంగల మర్రి ఎక్స్ రోడ్డు వద్ద శనివారం రోజున సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు కృష్ణారావు,



సింగిల్విండో చైర్మన్ మేనేని రాజనర్సింగరావు హనుమాన్ భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు, పండ్లు, పంపిణీ చేశారు. మజ్జిగ ప్యాకెట్లు, పండ్లను గోపాల్ రావు పేట గ్రామ టిఆర్ఎస్ నాయకులు గాడిచర్ల శ్రీకాంత్ రెడ్డి సమకూర్చారు. ఈ కార్యక్రమంలో తెరాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, కొండగట్టు దేవస్థాన డైరెక్టర్ ఉప్పుల గంగన్న, నాయకులు అంబటి తిరుమలేష్, కోలాపురం రమేష్, నేరెల్ల మహేష్, అంజన్ కుమార్, గుండు రాజ్ కుమార్, జలంధర్ రెడ్డి, అనుమాండ్ల అజయ్ రెడ్డి, గౌడ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



కాలి నడకన కొండగట్టు వెళుతున్న హనుమాన్ దీక్షా స్వాములకు జగిత్యాల కొత్త బస్టాండ్ పెట్రోల్ బంకు వద్ద నీళ్ళు, పండ్లు, కరబూజ పండ్ల ముక్కలను అందించి సేవ చేస్తున్న పద్మశాలి సేవా సంఘం మాజీ అధ్యక్షులు వొల్లాల గంగాధర్, మాజీ కార్యదర్శులు బాగా చిన్న జీయర్, చిలుక రాజన్న, మాజీ డైరెక్టర్లు బాలాజీ, ఎలిగేటి శంకర్, మరియు మానపురి మహేష్, తదితరులు.

## మన ఊరు - మన బడి పాఠశాల భౌతికవనరుల ప్రారంభోత్సవం

**భీమదేవరపల్లి ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** హన్మకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండల కేంద్రం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వొడితేల సతీష్ కుమార్



పాల్గొన్నారు. ఇందులో భాగంగా మన బడి పాఠశాల భౌతిక వనరుల, ప్రారంభోత్సవం కార్యక్రమానికి హాజరైనారు. పాఠశాలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డా. సుదీర్ కుమార్, ఎంపీపీ జక్కుల అనితా రమేష్ యాదవ్, మార్పాటి మహేందర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామనామ స్మరణతో మారుమ్రోగిన "కొండగట్టు"

### పాదయాత్రతో కొండపైకి చేరుకున్న అంజన్న దీక్షాపరులు

### కాషాయమయమైన కొండగట్టు కొండలు

### అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీస్ బందోభస్తు

( జగిత్యాల ప్రతినిధి: చుక్క గంగారెడ్డి)

చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా వేలాది మంది హనుమాన్ దీక్షా స్వాములు, భక్తులు కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం ఆలపించిన రామ నామస్మరణ ఎంతో భక్తిపారవశ్యంతో నిండి పోయింది. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామపంచాయితీ



పరిధిలోని కొండపై వెలిసిన కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధి చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొండపైకి వచ్చే భక్తుల" రామనామస్మరణతో "ఆలయం" మారుమ్రోగింది. జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా నుంచే గాకుండా తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాదు జిల్లాల నుంచి వేలాదిమంది హనుమాన్ దీక్ష పరులు పాదయాత్ర చేస్తూ శనివారం కొండపైకి చేరుకొన్నారు. కోనేరులో స్నానాలాచరించారు. క్యూలైన్ల ద్వారా స్వామి వారిని దర్శించుకొని మాల విరమణ చేశారు. దీంతో కొండపైన భక్తుల రద్ది మరింత పెరిగింది.

జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ స్వాములు చేసిన కీర్తనలు, భజనలతో కొండగట్టు క్షేత్రం పులకించిపోయింది. అత్యంత భక్తి శ్రద్ధలతో 21,11 రోజులు హనుమాన్ దీక్ష తీసుకున్న స్వాములు ఇరుముడి కట్టుకొని పెద్ద సంఖ్యలో జై శ్రీరామ్ - జై హనుమాన్ అంటూ నామ జపం చేస్తూ పాదయాత్రతో కొండపైకి చేరుకోవడంతో భక్తుల రద్ది పెరిగి కొండగట్టు కాషాయమయమైంది. కొండపైన ఎటు చూసినా హనుమాన్ దీక్షాపరులే కనిపించారు. దీంతో కొండగట్టు భక్తులు ధరించిన కాషాయ దుస్తులతో నిండిపోయింది.


జగిత్యాల జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ రూపేష్ ఆధ్వర్యంలో జగిత్యాల, మెట్పల్లి డిఎస్పీలు ప్రకాష్, రవీందర్ రెడ్డి ల పర్యవేక్షణలో సిఐ లు రమణమూర్తి, కృష్ణ కుమార్, శ్రీనివాస్, కోటేశ్వర్ తదితరుల నేతృత్వంలో మల్యాల ఎస్సై మంద చిరంజీవి, మరో పలువురు ఎస్సైలతో పాటు 500 మందికి పైగా పోలీసు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు.



వేసవి కాలం దృష్ట్యా దేవస్థానం పక్షాన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కొండపైన చలువ పందిల్లు వేసి త్రాగునిటీవసతి కల్పించారు. ఆలయంలో తోపులాటకు అవకాశం లేకుండా భక్తులను క్యూలైన్ల ద్వారా స్వామి వారి దర్శనం చేయించారు. జగిత్యాల పట్టణంలోని వివిధ హనుమాన్ ఆలయాల్లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ దావ వసంత - సురేష్, జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్, పలువురు కౌన్సిలర్లు ఆలయాల్లో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు గోత్రణామాధులతో అర్చనలు చేశారు. అన్నదాన కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. కోరుట్ల, ధర్మపురి నియోజక వర్గాలలోని పలు పట్టణాలతో పాటు వివిధ గ్రామాలలో హన్మాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవపేతంగా, ఘనంగా నిర్వించారు.

## ఇంటి పెద్ద దిక్కుని కోల్పోయిన కుటుంబానికి అండగా నిలిచిన టిఆర్ఎస్ ప్రభుత్వం

**తిమ్మాపూర్ ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన చింతల ముకుందం అనే టిఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా ఆయనది నిరుపేద కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఎన్నో



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ మరియు సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షుడు బోయిని కొమురయ్య స్థానిక ఎమ్మెల్యే రసమయి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే రసమయి ఆలస్యం చేయకుండా వెంటనే ప్రత్యేక చొరవ తీసుకొని ఆ కుటుంబానికి రైతు బీమా పథకం కింద 5 లక్షలు, పార్టీ సభ్యత్వం ఇన్సూరెన్స్ కింద 2 లక్షల చెక్కులను బాధితురాలుకు అందజేశారు. ఇటీవల ముకుందం భార్య చింతల అరుణ కూడా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ కింద (1,50,000) ఒక లక్ష యాభై వేల రూపాయలు మంజూరు కాగా శనివారం ఎమ్మెల్యే రసమయి చెక్కును పంపిణీ చేశారు. ఈ నిరుపేద కుటుంబానికి టిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు మొత్తం 8 లక్షల 50 వేల రూపాయల లబ్ది చేకూర్చగా ఎమ్మెల్యే రసమయి కి గ్రామ సర్పంచ్ కొమురయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా బాధితురాలు చింతల అరుణ మాట్లాడుతూ.... మా ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు.

ఈ డబ్బులతో మా కూతురు పెళ్లి చేయటానికి మాకు కొండంత ధైర్యం కల్పించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కి జీవితాంతం రుణపడి ఉంటానని రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆకట్టుకున్న చిరుతల రామాయణం

### ప్రశంసా పత్రాలు అందుకున్న కళాకారులు

**చిగురుమామిడి ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** మండలం లోని ఇందుర్తి గ్రామంలో జరిగిన చిరుతల రామాయణం ప్రాచీన కళలకు ప్రాణం పోసే విధంగా ముఖ్యమైన పాత్రలలో అందర్నీ అలరించారు. ఇందుర్తి గ్రామం చుట్టూ పక్క గ్రామాల నుంచి రామాయణాన్ని వీక్షించడానికి భారీ ఎత్తున హాజరయ్యారు. అనంతరం జిల్లా అధ్యక్షులు వంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రాచీన కళలలు ఆదరణ లేక మూలన పడుతున్న వేళ మన కళాకారులను మన కళలను మన సంస్కృతిని కాపాడుకోవాలని ప్రాచీన కళలను వెలుగులోకి తీసుకురావడానికి అందరూ కళాకారులు ఇలాగే కార్యక్రమాలు చేస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ కళాకారులకు తెలంగాణ రంగస్థల కళాకారుల అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొల్లా కొమురయ్య, సహాయ కార్యదర్శి చందబోయిన పర్శరాములు, చిగురుమామిడి మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాధరపు సంపత్, కళాకారులు గట్టు మొగిలి, చింతపూల బాలయ్య, జంగా కొమురయ్య, చింత పూల రవీందర్, కుతాడి కొమురయ్య, మొగిలి బొందయ్య, మొర వెంకట మల్లు, జవ్వాజి రాములు, అన్నాడి మల్లికార్జున్ రెడ్డి, సొన్నాయిల భరత్, సంపత్ రెడ్డి, చంద్రారెడ్డి, కుమార



స్వామి, మధు సుధన్, అంజయ్య, కొమురయ్య, సుంద రయ్య, సంపత్, రమణారెడ్డి,శంకర్, శ్రీనివాస్, తిరుపతి, మధు, రాజు, రమేష్, అశోక్, రాములు, చంద్రయ్య, లతో పాటు ఇందుర్తి, గాగిరెడ్డిపల్లె, సుందరగిరి, చిగురుమామిడి, రేకొండ, లంబాడిపల్లె, సీతారాంపూర్, ఓబులాపూర్, కొండాపూర్, నవాబుపేట్, మొగిలి పాలెం, తదితర గ్రామల కళాకారులు పాల్గొన్నారు.

## జనగామ జయకరంగా 'రన్ ఫర్ జీసస్'

జనగామ ఏప్రిల్ 16 (ప్రజామంటలు): ఏసుక్రీస్తు మానవుల పాపముల కొరకై చనిపోయి మూడవ రోజున తిరిగి లేచారని ఈ సందర్భంగా మానవాళికి ఏసుప్రభు యొక్క ప్రేమ త్యాగము సిలువ బలియాగము తెలియజేయడానికి 'రన్ ఫర్ జీసస్' అనే కార్యక్రమం జనగామ పట్టణంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అగాఫె ఇంటర్ ఫెయిత్ మినిస్ట్రీ ఫౌండర్ కె.ఎం. జాన్ జెండా ఊపి ప్రారంభించారు. జనగామ స్థానిక ఉన్నపుర బాప్టిస్ట్ చర్చ్ నుండి నెహ్రూ పార్క్ గిర్నిగడ్డ, ధర్మ కంచ, సంజయ్ నగర్ అంబేద్కర్ నగర్ పాల కేంద్రం, చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది.



పట్టణంలోనే కాకుండా వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయకరంగా జరిగిన. కే యం జాన్, పీ. ఫిలిప్, కొంగరి మోజస్, దేవ సహాయం, సంజీవ కుమార్, దేవదానం, రవి,నవీన్, సంపత్ బక్క లక్ష్మణ్, ప్రిస్టన్ ఇన్స్టిట్యూట్ కరస్పాడెంట్ బక్క ప్రవీణ్ కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పుల సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ పండుగ సందర్భంగా రన్ ఫర్ జీసస్ చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్ డి. పీటర్, సిహెచ్ ప్రవీణ్, తదితరులు

## కొప్పూర్‌లో తప్పిపోయిన యువతి

### ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి - ఎస్సై సురేష్

**భీమదేవరపల్లి ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** ములుకనూర్ పోలీస్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఓ యువతి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ములుకనూర్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఫోటోలో కనిపిస్తున్న మహిళ పేరు వగలబోయిన అనూష (28) కొత్తకొండ గ్రామానికి చెందినదని, సదరు యువతి తప్పిపోయినదని తెలిపారు. ఫోటో లోని మహిళ తప్పిపోయినపుడు ఎరుపు రంగు చీర కట్టుకొని ఉందని తెలిపారు. ఆచూకి తెలిసినవారు ఈ ఫోన్ నంబర్లకు ఎస్సై ములుకనూర్ 9440795132, పోలీస్ స్టేషన్, 8331940635, 9441971720, 9966991981. యువతి ఆచూకీ లేదా పూర్తి వివరాలు అందిన వెంటనే తెలియ జేయలని ఎస్సై మీడియాతో తెలిపారు.



## ఎస్.ఎస్.సి. విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ వితరణ

**జనగామ ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ జనగామ డైమండ్స్ ఆధ్వర్యంలో జడ్. పి. హెచ్.ఎస్. చౌడారం గ్రామంలో ఎస్.ఎస్.సి. చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడు, పెన్ను, పెన్సిల్, ఎరేజర్, షార్ప్నర్ పరీక్షకు అవసరమైన వస్తువులు లయన్స్ క్లబ్ జనగామ డైమండ్స్ సభ్యుడు తోడుపు



నూరి ప్రసాద్ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జనగామ డైమండ్స్ అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్ తో పాటు కోశాధికారి బీజాల నవీన్ కందుకూరి కుమార్, తుడుపు నూరి ప్రసాద్, పులిగిల్ల సంజయ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్ పంపిణీ

**మల్యాల ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి జన్మదిన సందర్భంగా శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వడ్లకొండ సురేష్ (పరీక్ష అట్టలను) ఎగ్జామ్ పాడ్స్ ను సర్పంచ్ చేతుల మీదుగా శనివారం పంపిణీ



చేశారు. నాయకులు మాట్లాడుతూ.... విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సానుకూల దృక్పథంతో ఆత్మవిశ్వాసంతో రాబోవు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుదర్శన్, సంఘం నాయకులు గోవర్ధన్, జగదీశ్వర్, రాజేందర్, మల్లేశం, శ్రీనివాస్, పద్మశాలి సంఘం సభ్యులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన శ్రీధర్ అనే వ్యక్తి కి 'ఓ ప్లస్' రక్తం అవసరం ఉండగా రుద్రంగి కి చెందిన యువకుడు మెట్పల్లి హాస్పిటల్‌కి వెళ్లి, రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న "బలగం రమేష్"





## కొడిమ్యాల ఎంపిపి స్వర్ణలతకు ద శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ రవి

**కొడిమ్యాల ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల ప్రజా పరిషత్ కు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా జాతీయస్థాయి అవార్డు కు ఎంపిక కాగా శనివారం మర్యాద పూర్వకంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ జి. రవి ని ఎంపీపీ మెనేని స్వర్ణలత రాజనర్సింగరావు కలువగా పూలమొక్కలు బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మేనేని రాజనర్సింగారావు, వైస్ ఎంపీపీ పర్లపల్లి ప్రసాద్, ఎంపిటిసి లు ఊట్కూరి మల్లారెడ్డి, చీకట్ల సింధూజ మహేష్, కో ఆప్షన్ సభ్యులు నసీరొద్దీన్, కొండగట్టు దేవస్థాన డైరెక్టర్ ఉప్పుల గంగన్న, తెరాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, అంబటి తిరుమలేష్, నేరెల్ల మహేష్, కోలాపురం రమేష్, బండపెల్లి అంజన్ కుమార్, గుండు రాజు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి

**చిగురుమామిడి ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ సంస్థ విద్యుత్ చార్జీలను గృహ వినియోగదారులకు యూనిట్ కు 50పైసలు,



పరిశ్రమలకు యూనిట్ కు రూపాయి చొప్పున పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై విపరీతమైన భారాన్ని వేసిందని బిసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి దాసరి ప్రవీణ్ కుమార్ నేత అన్నారు. శనివారం రోజున ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని ఇంత భారీ మొత్తంలో వేసిన భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలని దాసరి ప్రవీణ్ కుమార్ నేత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గృహ వినియోగదారులకు ప్రస్తుతం యూనిట్ కు రూ. 1.45 పైసలు కాగా ఇప్పుడు యూనిట్ కు 50 పైసలు పెంచి రూ 1.95 పైసలు అనగా 34 శాతం వరకు పెంచారని, పరిశ్రమలపై ప్రస్తుతమున్న యూనిట్ చార్జీలపై రూపాయి పెంచింది. దీంతో 25శాతం నుంచి 30శాతం వరకు పెంచి భారం వేశారని ఆయన విమర్శించారు. మొత్తం డిస్కోంలకు రావాల్సిన ఆదాయాన్ని 25శాతం పెంపుదల చూపారని తెలిపారు. టారీఫ్ రేట్ల బహిరంగ విచారణలో పాల్గొన్న అనేక మంది చార్జీలు పెంచవద్దని, భారాలను ప్రభుత్వమే సబ్సిడీగా భరించాలని శాస్త్రీయంగా వివరించారని దాసరి ప్రవీణ్ కుమార్ నేత తెలిపారు.

## తగ్గించే స్వభావం ఎదుగుదలకు సోపానం

**ధర్మసాగర్ ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** ఇతరులకు సేవ చేసే విషయంలో తగ్గించుకునే స్వభావం ఉంటే అన్ని రంగాల్లో ఎదుగుదల సోపానమని క్రీస్తుజ్యోతి మినిస్ట్రీ స్ కరుణాపురం డైరెక్టర్ డాక్టర్ జయప్రకాశ్ గోపు అన్నారు.



హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలో శనివారం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం లో ప్రవక్త డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్ 12 శిష్యుల పాదాలు కడిగే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యేసుక్రీస్తు అనుసరించిన మార్గాన్ని ప్రతి యేటా విశ్వాసుల సమక్షంలో కడుగుతున్నారని అన్నారు. ఇతరుల పట్ల సేవా దృక్పథం కలిగి ఉండాలని అన్నారు. చిన్న పెద్ద తేడాలేకుండా అందరి యెడల తగ్గించుకోవాలని యేసు క్రీస్తు మాదిరిగా సమాజానికి మార్గం చూపారని అన్నారు. క్షమాగుణం కలిగిన ఉన్న స్వభావం మంచి వ్యక్తిత్వం ప్రతిబింబించేలా చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్ మాట్లాడుతూ యేసుక్రీస్తు ఉపదేశాన్ని అనుసరించి పరిశుద్ధంగా జీవనం కొనసాగించాలని కోరారు.దేవుడై ఉండి స్వయంగా పాదాలు కడిగిన యేసుక్రీస్తు తగ్గింపు జీవితం నేటి సమాజానికి గొప్ప సందేశమని అన్నారు. 12 మంది శిష్యుల పాదాలు కడుగుతూ ఉంటే విశ్వాసులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ కార్యక్రమంలో మత్త్యస్ రెడ్డి, జయపాల్ రెడ్డి, సంగాల యూర్మియా, ఆర్.రవి పాల్ తదితరులు పాల్గొన్నారు.

**జనగామలో తాండ్ర నర్సయ్య మృతి: శ్రద్ధాంజలి ఘటించిన జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎర్రమల్ల సుధాకర్, సర్వాల నర్సింగరావు,**



**చెంచారపు బుచ్చిరెడ్డి, మేడ శ్రీనివాస్, బనుక శివరాజ్ యాదవ్, గనిపాక మహేందర్, జినుకల రాజు, తాండ్ర రాములు, రమగల్ల విజయ్, తాండ్ర ప్రసాద్, తాండ్ర కమలాకర్, ఎర్రవెల్లి ఆనందం, గణేష్, శ్రీను, నర్సింగరావు, రమేష్**

### ఆర్.ఎస్. ప్రవీణ్‌ను అవమానించారని

# బిఎస్పీ నిరసన

**జగిత్యాల ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** ప్రోటోకాల్ పేరిట బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ను అవమానించారని బీఎస్పీ జగిత్యాల జిల్లా నేతలు శనివారం జగిత్యాల లో నిరసనకు దిగారు. స్థానిక తహసిల్ చౌరస్తాలో నిరసన చేపట్టిన అనంతరం బిఎస్పీ జిల్లా ఇంచార్జ్ చిర్ర శంకర్ మాట్లాడుతూ బిఎస్పీ ఆషాకిరణం ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సారని యావత్ బహుజనులు ప్రవీణ్ వెంటే నడుస్తున్నారన్నారు. బహుజనులు ఆరాధ్యదైవం



ప్రవీణ్ కుమార్ ను ప్రోటోకాల్ పేరిట అవమానించడం బాధాకరమన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సూర్యాపేట లో జరిగిన కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు ప్రవీణ్ కుమార్ వేసే పూల మాల బహుజనులందరి పక్షాన ఉంటుందన్నారు. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని చిర్ర శంకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి సంపత్, జిల్లా కోశాధికారి బొల్లారపు సతీష్, నియోజకవర్గ అద్యక్షులు బింగి నరేష్, ఉపాధ్యక్షుడు వేణు, రాయికల్ అద్యక్షులు దేవేందర్, పట్టణ అద్యక్షులు గంగాధర్, సయ్యద్ రహీం, రాథోడ్ నాయక్ లు ఉన్నారు.

**కొండగట్టులో ఆంజనేయస్వామిని దర్శించుకున్న కొడిమ్యాల సింగిల్విండో చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, కొండగట్టు దేవస్థాన డైరెక్టర్ ఉప్పుల గంగన్న, కొడిమ్యాల మండల తెరాస అధ్యక్షులు పులి వెంకటేష్, తిరుమలేష్, రమేష్**



# జగిత్యాల సబ్ జైల్‌లో మంచినీటి ఆర్ఓ ప్లాంట్

### ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**జగిత్యాల ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** జైలు జీవితం ద్వారా ప్రవర్తనలో మార్పు సాధించాలని, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ జై రవి ఖైదీలకు సూచించారు. శనివారం



జగిత్యాల జిల్లాలోని సబ్ జైలు ను సందర్శించి, మంచినీటి ఆర్ఓ ప్లాంట్ ను లాంఛనంగా ప్రారంభించారు. జగిత్యాల జిల్లా సబ్ జైలు వినియోగానికి గాను ప్రతి గంటకు 500 లీటర్ల మంచినీరు అందించే ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ రూ. 95,150/- నిధులను మంజూరు చేశారు. జిల్లా కలెక్టర్ నిధుల కేటాయింపుతో ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్ఓ ప్లాంట్‌ను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆవేశంలో లో చాలా మంది తప్పులు చేసి శిక్ష అనుభవిస్తున్నారని, జైలు జీవి తంలో మంచి ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు.

ఖైదీల జీవితంలో క్రమశిక్షణగా జీవించడం, యోగా మెడిటేషన్, నైపుణ్యాలు పెంపొందించే దిశగా శిక్షణ అందిస్తున్నామని వాటిని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని, శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో మంచి పౌరులుగా జీవించడానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జైలు జీవితం గడిపిన చాలా మంది వారి పరివర్తనలో మార్పు సాధించి జీవితంలో మంచి స్థాయికి చేరుకున్నారని, సకాలంలో మంచి అంశాల పట్ల శ్రద్ధ వహించి నేర్చుకోవాలని, మంచి సహవాసాలు చేయాలని మరోసారి తప్పు చేయాలనే ఆలోచన రాకూడదని కలెక్టర్ సూచించారు.

జైలులో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన మేర తన వంతు సహకారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. జైలు పరిసరాల చుట్టూ తిరిగి పరిశీలించిన జిల్లా కలెక్టర్ పరిసరాల పరిశుభ్రత, జైల్లో గార్డెన్ చెట్ల పెంపకం వంటి వాటిని అభినందించారు. జైలు చాలా పకడ్బందీగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ సంబంధిత అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జైళ్ళ అధికారి శ్రీనివాస్, జగిత్యాల సూపరిండెంట్ ఆఫ్ జైల్ సత్తయ్య, ఆర్.డి.ఓ.జగిత్యాల ఆర్.డి.మాధవి, తసీల్దార్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబాల చక్రపాణికి 'దళిత రత్న' అవార్డు

**భీమదేవరపల్లి ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** భారతరత్న డా. బి.ఆర్ అంబేద్కర్ 131వ, జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొప్పూర్ గ్రామానికి చెందిన అంబాల చక్రపాణికి దళితరత్న అవార్డ్ ప్రధానం చేశారు. గత 20 సం.ల నుండి చక్రపాణి చేసిన సామాజిక సేవలను గుర్తించి హైదరాబాద్ రవీంద్రభారతిలో దళిత రత్న అవార్డు మంజూరు చేశారు.



శనివారం హుస్నాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే సతీష్ బాబు మరియు హనుమకొండ జిల్లా జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ ల ఆధ్వర్యంలో దళితరత్న అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి అవార్డ్ ఇచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెప్పాల ప్రకాష్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్, అంబేద్కర్ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సాతురి చంద్రమౌళి, మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ మాడుగుల అశోక్, ఎమ్మార్పీఎస్ టీఎస్ భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు కొమ్ముల నగేష్, ఎమ్మార్పీఎస్ టీఎస్ భీమదేవరపల్లి మండల అధికార ప్రతినిధి కొమ్ముల రవీందర్, కొప్పూర్ ఎంపీటీసీ కొత్తకొండ లలితా-నాగరాజ్, సర్పంచ్ గద్ద రాజమణి-సమ్మయ్య, రచ్చ సంపత్, కండే చిరంజీవి, సుంచు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### హనుమాన్ జయంతి అన్నదాన కార్యక్రమంలో....

# దళితుల స్వాములను వడ్డన చేయొద్దని ఆక్షేపణ

**మల్లాపూర్ ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** మల్లాపూర్ మండలం నడుకుడ గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలోని అన్ని కులాల ప్రజలు అందరు కలిసి చందాలు వేసుకొని జయంతి రోజు గ్రామంలోని హనుమాన్ టెంపుల్ వద్ద అన్నదానం కార్యక్రమంలో హనుమాన్ దీక్ష లో ఉన్నటువంటి మాల



మాదిగ స్వాములు వడ్డన చేస్తున్నారు. ఆ సమయంలో ఆ గ్రామంలోని కొందరు అగ్రవర్ణ కులస్తులు అక్కడికి వచ్చి మీ మాల, మాదిగలు అన్నం వడ్డన చేస్తే మేము తినమని గ్రామ ప్రజలందరి ముందు అవమానిస్తు, అక్కడి నుండి టేబుల్ తీసుకొని కొంతదూరంలో వేరుగా టేబుల్ వేసుకొని వాళ్ళు వడ్డన చేసుకున్నారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దేశంలో ప్రజలంతా సమానమని చట్టాలు, రాజ్యాంగం చెబుతున్నాయి అయినా గానీ మన దేశంలో అడుగడుగునా దళితులకు అవమానాలు జరుగుతున్నాయి ఈ విధంగా దళితులను అవమానించినటువంటి దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేష్ డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా మల్లాపూర్ మండల తహసీల్దార్ రవీందర్ కి దరఖాస్తు ఇవ్వడం జరిగింది. మల్లాపూర్ పోలీస్ స్టేషన్లో లో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబెద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు బోడా ప్రశాంత్, మేకల సతీష్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, జంగం దినేష్ , పాతకాల కిరణ్ దళిత రాజు, నూతి పెల్లి రాజం, ఉయ్యాల లక్ష్మణ్, మద్దెల నరసయ్య మరియు నడికుడ గ్రామంలోని మాల మాదిగ కుల సంఘాల సభ్యులు దాదాపు వందమంది ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ పాఠశాలకు కార్పొరేట్ హంగులు

### సీఎస్ఆర్ నిధులతో పెయింటింగ్ పనులు

### అప్స సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**సికింద్రాబాద్ ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** కార్పొరేట్ కంపెనీల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో ప్రభుత్వ పాఠశాలలు కొత్త కళను సంతరించుకుంటున్నాయి. సీ ఎస్ ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు పెయింటింగ్ పనులను నిర్వహిస్తున్న అప్స స్వచ్ఛంద సంస్థ ఆదర్శంగా నిలుస్తోంది. వివరాలు ఇవి..



ఆక్జోనోబల్ అనే కార్పొరేట్ కంపెనీ తన సీఎస్ఆర్ నిధులతో అప్స సంస్థ పరివర్తన్ ప్రాజెక్ట్ సహకారంతో మేడ్చల్ జిల్లా జగద్గిరగుట్ట ప్రాంతంలోని ఆర్ పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం, తరగతి గదులకు పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అప్స ప్రాజెక్ట్ మేనేజర్ బస్వరాజ్ మాట్లాడుతూ....



ఆక్జోనోబల్ సీఎస్ఆర్ నిధులతో జగద్గిరగుట్ట ప్రాంతంలోని మూడు ప్రభుత్వ స్కూళ్ళల్లో పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికల విద్యను ప్రోత్సహించాలనే ఆక్జోనోబల్ కంపెనీ లక్ష్యమన్నారు. బాలికలకు నాణ్యత విద్య ను అందిస్తే వారు భవిష్యత్ లో మంచి స్థానంలో స్థిర పడాలని కంపెనీ ఆలోచన అని వివరించారు. పెయింటింగ్ పనులతో ప్రభుత్వ పాఠశాలలు కొత్త కళ ను సంతరించుకోవడంతో అటు విద్యార్థులు, తల్లిదండ్రులు, బోదన సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు నిర్వహిస్తున్న అక్జోనోబల్ కంపెనీ, అప్స సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్పర్సన్

**జగిత్యాల ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** హనుమాన్ జయంతి ఉత్సవం ను పురస్కరించుకొని శనివారం అరవింద్ నగర్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి పారాయణంలో పాల్గొన్న జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్. ఈ సంద్భంగా జెడ్పీ చైర్పర్సన్ మాట్లాడుతూ.... ఆరోగ్య ప్రదాత, జ్ఞాన ప్రదాత,అభయ ప్రదాత అయినటువంటి ఆంజనేయ స్వామి ఆశీస్సులు జిల్లా ప్రజల అందరిపై ఉండాలని అందరికీ ఆరోగ్యం మరియు విజయంలో ఆ భగవంతుడు తోడుండాలని మనస్ఫూర్తిగా ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తూ హనుమాన్ పుట్టినరోజు సందర్భంగా జగిత్యాల జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధులకు అధికారులకు అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ చైర్మన్ బట్టు సుధాకర్ కొత్త మోహన్, గుడికందుల శ్రీనివాస్, కొత్త పెల్లి శ్రీనివాస్, ముసిపట్ల లక్ష్మీ నారాయణ, వీరబత్తిని శ్రీనివాస్, కృష్ణ రెడ్డి మహిళలు పాల్గొన్నారు.





**హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ దీక్షాపరులకు జగిత్యాల పట్టణంలో అరటి పళ్ళు, నీళ్ళు, కరబూజ పళ్ల ముక్కలు అందిస్తూ సేవ చేసిన జగిత్యాల పద్మశాలి సేవ సంఘ ఉపాధ్యక్షులు చింతకింది రవి చందు, చింటూ, మానపురి మహేశ్ తదితరులు.**



**జగిత్యాల పట్టణ మార్కండేయ దేవాలయములో హనుమాన్ జయంతి సందర్భంగా "మహిళలచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం" నిర్వహించారు. అంజన్న నామస్మరణతో మారుమ్రోగిన ఆలయం. కార్యక్రమ ఏర్పాటు చేసిన జగిత్యాల పద్మశాలి సేవ సంఘ అధ్యక్షులు ఆకుబత్తిని శ్రీనివాస్, కార్యదర్శి తాటిపాముల వినోద్ కుమార్ లను అభినందించిన మహిళలు**

# వింత వ్యాధితో మృతి చెందుతున్న పశువుల రక్త నమూనాల సేకరణ

### జిల్లా పశు సంవర్ధక అధికారి వెంకట నారాయణ

**భీమదేవరపల్లి ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** ఇటీవల మండలంలోని కొత్తకొండల్లో వింత వ్యాధి లక్షణాలతో మృతి చెందుతున్న పాడి పశువుల రక్త నమూనాలు సేకరించి మెరుగైన సమాచారం నిమిత్తం హైదరాబాద్ కు పంపించినట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి వెంకటనారాయణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పశువులు మృతి చెందడంపై జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకట్ నారాయణ, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డా. నాగమణి, స్థానిక పశు వైద్యాధికారి మాలతి, వేలేరు పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి సందర్శించారు. అనంతరం పరీక్షలు జరిపి రక్త నమూనాలు సేకరించారు. ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేశామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ సర్పంచ్ దూడల ప్రమీలా సంపత్, పంచాయతీ సెక్రటరీ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





# సంప్రదాయ రీతిలో హనుమజ్జయంతి వేడుకలు

**(రామ కిష్టయ్య సంగన భట్ల- ప్రజా మంటలు):**

తెలంగాణ లోని ప్రాచీన పుణ్య క్షేత్రాలలో నొకటియై, పవిత్ర గోదావరీ నదీ తీరాన వెలసి, పలు దేవాలయాల సముదాయంతో అలరారుతున్న పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు సంప్రదాయ రీతిలో జరిగాయి. అంజనీ పుత్రుడైన మారుతి శరణు ఘోషలు, జయజయ ధ్వనాలు, భగవ న్నామ స్మరణలు, భక్తి సంగీతాలు, వేద మంత్రాలతో సనాతన క్షేత్రంలో భక్తి పారవశ్యం పొంగి పొర్లింది. ఉదయాత్పూర్వం ప్రత్యే కించి హన్మాన్ దీక్షాపరులు పవిత్ర గోదావరిలో మంగళ స్నానా లను ఆచరించి, నదీతీరాన గోదా వరీ భద్రానదీసంగమ



స్థానాన వెలసిన దక్షిణాభిముఖుడైన భక్తాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. చారిత్రిక, పౌరా ణిక నేపథ్యాన్ని కలిగిన ఈ ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం ఆరు గంటలనుండి మహన్యాస పూర్వక రుద్రాభి షేకాలు, మన్యుసూక్త సంపుటి, సుందరాకాండ పారాయణాది ప్రత్యేక పూజలను అనువంశిక అర్చకులు మధ్వాచారి రాంకిషన్ శర్మ ఆద్వర్యంలో సాంప్రదాయ వేదోక్త రీతిలో నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాంతర్గత ఆంజనేయస్వామి ఆలయంలో దేవస్థాన అర్చకులు వొద్దిపర్తి నరసింహ మూర్తి, కళ్యాణ్, కార్తీక్, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ ఆధ్వర్యంలో, ఈఓ శ్రీనివాస్, ఐ. రామయ్య నేతృత్వంలో, ప్రత్యక్ష పర్య వేక్షణలో, శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి రుద్రాభి షేకం, మన్యుసూక్తం , సుందరాకాండ పారాయణం లతో ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ ముత్యాల శర్మ, ప్రవీణ్ కుమార్, ఉపప్రదాన అర్చకులు నేరెళ్ళ శ్రీనివాసాచార్య, స్థానిక వేదపండితులు మధు శంకర్ శర్మ , అర్చకులు వొద్దిపర్తి నరసింహ మూర్తి , కళ్యాణ్ కుమార్ , నంబి అరుణ్ కుమార్, బొజ్జ రాజగోపాల్ , రెనవేషన్ కమిటీ చైర్మన్ ఇందారపు రామయ్య, సభ్యులు అక్కనపల్లి సురేందర్, పల్లెర్ల సురేందర్, వేముల నరేష్, గునిశెట్టి రవీందర్, వీరవేణి కొమురయ్య, ఇనగంటి రమ వెంకటేశ్వర రావు, అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.. అలాగే చింతామణి చెరువు కట్ట సమీపాన అంజన్న సన్నిధిలో బొజ్జా సంపత్ కుమార్, రాజ గోపాల్ శర్మ, వేదవిదులు...కలశ గణపతి పూజ, పుణ్యాహ వాచనం, పురుష సూక్త, షోడశోపచార పూజలు, రుద్రా భిషేకం, మన్యుసూక్త, పురుషసూక్త, లక్ష్మీసూక్త పంచోపనిషత్ యుక్త అభి షేకాలు, అష్టోత్తరశతి నామార్చనలు, సుందరాకాండ పారాయణాలు, సప్తహారతులు, మంత్రపుష్పాది కార్యక్రమాలను నిర్వహించారు. ఉపవాస దీక్షాదక్షులైన హన్మాన్ భక్తులు దేవస్థానంలో దర్శనాలు చేసుకుని, ప్రసాదాలనుకొని, పరమాన్నాలుగా గ్రహించారు. రామమందిరంలో తాడూరి మోహన్ శర్మ,, బలరాం శర్మ సాంప్రదాయ పూజనొనరించారు.

## ఉపేంద్ర డైరెక్షన్‌లో మెగాస్టార్ చిత్రం.. కానీ!





వరుణ్ తేజ్ హీరోగా కిరణ్ కొర్రపాటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గని'. సయీ మంజ్రేకర్ హీరోయిన్. అల్లు అరవింద్ సమర్పణలో అల్లు బాబీ, సిద్ధు ముద్ద నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానున్న విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రంలో కన్నడ నటుడు ఉపేంద్ర ఓ ముఖ్యమైన పాత్ర పోషించారు. ఇక తాజాగా ఈ చిత్ర ప్రమోషన్స్‌లో కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర మాట్లాడుతూ పలు ఆసక్తికర వాఖ్యలు చేశారు. తాను నటించిన ఉపేంద్ర వంటి చిత్రాల ద్వారా 24 సంవత్సరాలుగా తెలుగు ప్రేక్షకులకు తెలుసని కాని దానికంటే ముందు ఓ చిన్న ఫ్లాషబాక్ ఉంది. 'నాకు మెగా ఫ్యామిలీతో ఉన్న రిలేషన్ గురించి చెప్పాలి. 24 సంవత్సరాల క్రితం నేను డా. రాజశేఖర్‌తో 'ఓంకారం' అనే చిత్రాన్ని డైరెక్షన్ చేశాను. ఆ సమయంలో అశ్వినీదత్ నిర్మాణంలో మెగాస్టార్ చిరంజీవిని డైరెక్ట్ చేసే ఆఫర్ వచ్చింది. కానీ నాకు అదృష్టం లేక ఆ సినిమా చేయలేకపోయాను. ఆ చిత్రం చేయలేక పోయినందుకు బాధపడుతుంటాను' అని ఉపేంద్ర తెలిపారు.

## రవితేజ సమర్పణలో విష్ణు విశాల్ మరో సినిమా..







కోలీవుడ్ యంగ్ హీరో విష్ణు విశాల్ కథానాయకుడిగా మను ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎఫ్ఐఆర్'. విష్ణు విశాల్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళంలో ఫిబ్రవరి 11న విడుదలై మంచి పాజిటివ్ టాక్ సంపాందించుకుంది. మాస్ మహారాజ రవితేజ సమర్పణలో అభిషేక్ నామా ఈ సినిమాను తెలుగులో విడుదల చేశారు. అనేక వివాదాల నడుమ రిలీజైన ఈ మూవీ విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. అయితే తాజాగా రవితేజ సమర్పణలో విష్ణు విశాల్ మరో సినిమా రానుంది. రవితేజ సమర్పణలో విష్ణు విశాల్ 'మట్టి కుస్తీ' అంటూ క్రీడా నేపథ్యంలో వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆర్‌టీ టీమ్ వర్క్స్, విష్ణు విశాల్ స్టూడియోస్ బ్యానర్‌లపై డైరెక్టర్ చెల్లా అయ్యావు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ టైటిల్‌ను చిత్రబృందం మంగళవారం (ఏప్రిల్ 5) ప్రకటిస్తూ 'మట్టి కుస్తీ' మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే కుస్తీ ఆధారంగా ఈ చిత్రం రూపొందనున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీలో విష్ణు విశాల్‌కు జోడిగా ఐశ్వర్య లక్ష్మీ హీరోయిన్‌గా నటించనుంది. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందించగా.. 'మట్టి కుస్తీ' రెగ్యూలర్ షూటింగ్ బుధవారం (ఏప్రిల్ 6) నుంచి ప్రారంభమవుతుందని చిత్ర యూనిట్ ప్రకటించింది.

## హీరోయిన్‌కు వింత అనుభవం.. అతన్ని ఫాలో అవ్వమని కోరాడట

నేచురల్ స్టార్ నాని నటించిన 'జెర్సీ' మూవీతో తెలుగు ప్రేక్షకులకు పరిచమైంది శ్రద్ధా శ్రీనాథ్. తర్వాత సిద్ధు జొన్నల గడ్డ కృష్ణ 'అండ్ హిజ్ లీల',? 'మార' సినిమాలతో మరింత పాపులారిటీ దక్కించికుంది. దక్షిణాది భాషలన్నింటి సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది శ్రద్ధా.
అయితే తాజాగా ఓ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ఆమెకు జరిగిన వింత అనుభవాల గురించి సోషల్ మీడియా వేదికగా చెప్పుకొచ్చింది. సినిమా షూటింగ్ తర్వాత ఎయిర్‌పోర్ట్ వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేసుకుంది. క్యాబ్‌లో ప్రయాణించేప్పుడు డ్రైవర్ ఏసీ ఆన్ చేయలేదు. ఏసీ గురించి అడిగితే అందుకు డ్రైవర్ నిరాకరించాడు. 'పెట్రోల్ ధరలు పెరగడం వల్ల క్యాబ్ డ్రైవర్ ఏసీ ఆన్ చేసేందుకు నిరాకరించాడు. ఎంతోకొంత డబ్బు పొదుపు చేసేందుకు అలా చేశాడని నాకు అర్థమైంది. అందుకే నేను కూడా ఏం అనలేదు. కానీ ఓలా క్యాబ్ సంస్థ వాళ్ల సంపాదనను దోచుకుంటోంది.' అని ఇన్‌స్టాలో తెలిపింది. అలాగే తనకు ఎయిర్‌పోర్టులో జరిగిన మరో అనుభవాన్ని శ్రద్ధా వెల్లడించింది. 'ఎయిర్‌పోర్ట్ ఎంట్రాన్స్ వద్ద సెక్యూరిటీ ఒకతను నన్ను గుర్తుపట్టి, నా దగ్గరికి వచ్చి నా ఇన్‌స్టా గ్రామ్‌లో తన అకౌంట్ వెతికి అతన్ని ఫాలో అవ్వాల్సిందిగా కోరాడు. నేను సానుకూలంగా తిరస్కరించాను. దానికి అతను ఏ సమస్య లేదు. నేను మిమ్మల్ని ఫాలో అవుతాను. మీకు సపోర్ట్ చేస్తాను.' అని చెప్పాడని శ్రద్ధా పేర్కొంది.






## వంశీ-దిల్ రాజు ప్రాజెక్ట్ ప్రారంభం.. 20 ఏళ్ళలో రాని కథతో ప్రేక్షకుల ముందుకు?

తమిళ సూపర్ స్టార్ తలపతి విజయ్ స్టార్ డమ్ గురించి సగటు సినీ ప్రేమికులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. విజయ్ గత సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి రికార్డులను బద్దలు కొట్టాయి అంటే అతిశయోక్తి కాదు. అలా ఆయన అత్యంత డిమాండ్ ఉన్న కోలీవుడ్ స్టార్‌లలో ఒకరిగా మారిపోయాడు. ఇక ఈ మధ్య తెలుగు హీరోలు-తమిళ దర్శకులు, తమిళ హీరోలు-తెలుగు దర్శకుల కాంబోలు కుదురుతున్న క్రమంలో వంశీ పైడిపల్లి విజయ్‌తో ఒక ద్విభాషా సినిమా చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా అధికారికంగా ప్రారంభించారు. ఆ వివరాల్లోకి వెళితే

**విజయ్ హీరోగా**

దళపతి విజయ్ సినిమాలు కోలీవుడ్‌లోనే కాకుండా సౌత్ అంతా గట్టి కలెక్షన్స్ రాబడతాయి. అందుకే విజయ్‌కి తమిళంలోనే కాక తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉంది. ఆయన హీరోగా వచ్చిన చివరి సినిమా మాస్టర్ కూడా మంచి వసూళ్లను రాబట్టింది. అయితే ఇప్పుడు విజయ్ నేరుగా తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోన్నాడు.

**మొదటి స్ట్రైట్ సినిమా**

మహర్షి సినిమా తర్వాత చాలా కాలం పాటు సైలెంట్‌గా ఉండి మహేష్ బాబు, రామ్ చరణ్ లాంటి వారి డేట్స్ కోసం అనేక రోజులు ఎదురు చూసిన వంశీ పైడిపల్లి రాసుకున్న కథలో విజయ్ హీరోగా కనిపించబోతున్నాడు. తెలుగులో విజయ్‌కి మొదటి స్ట్రైట్ సినిమా అయిన ఈ సినిమాను దిల్ రాజు నిర్మించనున్నారు.

**నేషనల్ క్రష్**

ఇక తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న విజయ్, జాతీయ అవార్డు గ్రహీత దర్శకుడు వంశీ పైడిపల్లితో కలిసి జాతీయ అవార్డు పొందిన నిర్మాత దిల్ రాజు శిరీష్ తమ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పై ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించనున్నారు. నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఈ చిత్రంలో విజయ్ సరసన కథానాయికగా నటించనున్నట్లు రష్మిక పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ప్రకటించారు.

**ఇలాంటి స్టోరీ వినలేదని**

అంతేకాక సినిమాకు థమన్ సంగీతం అందిస్తాడని కూడా తాజాగా ప్రకటించారు. త్వరలో సెట్స్ పైకి వెళ్ళనున్న ఈ చిత్రంలో విజయ్‌ని మునుపెన్నడూ చూడని పాత్రలో ప్రెజెంట్ చేయడానికి వంశీ పైడిపల్లి పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. ఈ కథ విన్న విజయ్.. గత 20 ఏళ్లలో ఇలాంటి స్టోరీ వినలేదని అన్నాడు అని దిల్ రాజు ఆ మధ్య వెల్లడించారు. ఇక ఈ దీపావళికి ఈ సినిమాను రెడీ చేసి విడుదల చేయాలని దిల్ రాజు భావిస్తున్నాడట.

**పూజా కార్యక్రమాలతో**

అయితే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో బుధవారం ఉదయం చెన్నైలో మొదలైంది. ఈ పూజా కార్యక్రమంలో విజయ్, రష్మిక మందన్న, థమన్, దిల్ రాజు, వంశీ పైడిపల్లి పాల్గొన్నారు. ఇక విజయ్ లేటెస్ట్ మూవీ బీస్ట్ విడుదలకు సిద్ధంగా ఉంది..
ఏప్రిల్ 13న భారీ అంచనాల నడుమ ఈ సినిమా రిలీజ్ కానుంది. ఇప్ప టికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రమోషనల్ స్టఫ్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఇక ఈ సినిమాలో విజయ్ సరసన పూజా హెగ్డే హీరోయిన్ గా నటించింది.

## వరుణ్ లేకపోతే 'తొలిప్రేమ' సినిమా ఆగిపోయేదే!



టాలీవుడ్ లో బాక్సింగ్ నేపథ్యంలో రెండు మూడు సినిమాలు రూపొందుతూ వచ్చాయి. వాటిలో వరుణ్ తేజ్ హీరోగా చేసిన 'గని' ఈ నెల 8వ తేదీన భారీ స్థాయిలో థియేటర్లలో దిగిపోనుంది. ఈ నేపథ్యంలో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కి ఈ సినిమా నటీనటులు .. సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. వరుణ్ తేజ్ తో గతంలో 'తొలిప్రేమ' చేసిన వెంకీ అట్లూరి ఈ ఫంక్షన్ కి హాజరయ్యాడు. ఈ వేదికపై ఆయన మాట్లాడుతూ .. " ఈ సినిమా కోసం వరుణ్ చాలా కష్టపడ్డాడనే విషయం తెలుస్తూనే ఉంది. ఆయనతో జర్నీ చేయాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇండస్ట్రీకి అవకాశాల కోసం వచ్చినప్పుడు ఒక్క ఛాన్స్ దొరికితే చాలు అన్నట్టుగా ఉంటుంది. నా ఫస్టు సినిమా వరుణ్ తో చేసిన 'తొలిప్రేమ'. ఆ సినిమా దాదాపు ఆగిపోయే పరిస్థితి వచ్చింది. వరుణ్ లేకపోతే ఆ ప్రాజెక్టు ఆగిపోయి ఉండేది. వరుణ్ లేకపోతే ' తొలిప్రేమ' అనే ఆ సినిమా ఉండేదే కాదు. ఈ రోజున నాకు ఇంత గుర్తింపు రావడానికి కారణం ఆయనే. ఆ రోజున నాకు ఎలా అయితే ఆయన హెల్ప్ చేశారో .. ఈ రోజున కిరణ్ కొర్రపాటికి కూడా అలాగే హెల్ప్ చేశారు. కిరణ్ కొర్రపాటితో ఆయనకి ఉన్న పరిచయం కారణంగానే ఈ ఛాన్స్ ఇచ్చారు. నా కెరియర్ ఆరంభంలో 'తొలిప్రేమ' నాకు ఎంత పెద్ద హెల్ప్ అయిందో .. కిరణ్ కి కూడా అంతే హెల్ప్ కావాలని కోరుకుంటున్నాను. ఇక నేను ఉపేంద్రగారి సినిమాలు ఎక్కువగా చూసేవాడిని. ఆయన ఎక్కువ సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో సయీ చాలా బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. రోమియో వెంట జూలియట్ లా అనిపిస్తోంది. ఇక నేను షార్ట్ ఫిలిమ్స్ చేసుకుంటూ .. చిన్న చిన్న పాత్రలు వేస్తూ వస్తున్నాను. అప్పుడు యాక్టింగ్ మానేసి డైరెక్షన్ వైపు వెళ్లమని అల్లు బాబీ చెప్పారు. ఆ రోజున ఆయన చేసిన ఆ సూచన వల్లనే ఈ రోజున మీ ముందు డైరెక్టర్ గా నిలబడి ఉన్నాను. అందుకు ఆయనకి థ్యాంక్స్ చెబుతున్నాను. ఈ సినిమాలో తమన్ స్వరపరిచిన రోమియో జూలియట్ సాంగ్ నాకు బాగా నచ్చేసింది" అని చెప్పుకొచ్చాడు.

### వరుణ్ ను దగ్గరగా చూశాను .. అది మామూలు కటౌట్ కాదు!

ఈ మధ్య కాలంలో యంగ్ హీరోలు కొత్త దర్శకులకు అవకాశాలిస్తూ ముందుకు వెళుతున్నారు. సినిమా నిర్మాణ రంగంలోకి యువ నిర్మాతలు అడుగుపెట్టడం వలన వాళ్లు కూడా కొత్తదనానికి స్వాగతం పలుకుతూ న్యూ టాలెంట్ ను ప్రోత్సహిస్తున్నారు. అలా హీరో వరుణ్ తేజ్ తన 'తొలిప్రేమ' సినిమాకి డైరెక్షన్ డిపార్టుమెంటులో పనిచేసిన కిరణ్ కొర్రపాటికి ఛాన్స్ ఇచ్చాడు. కొత్త బ్యానర్ ను ఏర్పాటు చేసుకున్న అల్లు బాబీ తన స్నేహితుడితో కలిసి నిర్మాతగా .. తన తొలి సినిమాగా 'గని' సినిమా నిర్మించాడు.
'రిలీజ్ పంచ్' పేరుతో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ జెఆర్సీ కన్వెన్షన్ లో నిర్వహించారు. ఈ సినిమాలో ముఖ్యమైన పాత్రను పోషించిన నవీన్ చంద్ర మాట్లాడుతూ .. " అందరికీ నమస్కారం .. మీ అందరినీ ఇలా చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది. 'గని'ని సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ చాలా చాలా థ్యాంక్స్ చెబుతున్నాను. షూటింగు జరుగుతున్నప్పుడు వరుణ్ తేజ్ ను నేను చాలా దగ్గరగా చూశాను. ఫ్యాన్స్ కోసం ఆయన ఎంత కష్టపడ్డాడనేది నాకు తెలుసు. ఎక్కడ ఎలాంటి తేడా రాకుండా .. ఎక్కడా తగ్గకుండా ఆయన ఈ సినిమా కోసం కష్టపడ్డారు. అభిమానులు ఎన్నో అంచనాలతో వస్తారు .. వాళ్లని నిరాశపరచకూడదని చెప్పేవారు. బాక్సింగ్ నేపథ్యంలో వచ్చే సీన్స్ చేయడం అంత ఆషా మాషీ విషయమేం కాదు. ఈ సినిమా కోసం ఇష్టంగా కష్టపడ్డాం. ఈ సినిమాలో నాకు ఛాన్స్ ఇచ్చిన అల్లు బాబీ .. సిద్ధు .. కిరణ్ కొర్రపాటికి నేను థ్యాంక్స్ చెబుతున్నాను. ఇక అల్లు అరవింద్ గారిని నేను బిగ్ డాడీ అని పిలుస్తుంటాను. ఆయన ఈ సినిమాను చూసి .. సినిమా చాలా బాగుందయ్యా .. చాలా బాగా చేశావ్ అన్నారు. అప్పుడు నాకు చాలా సంతోషంగా .. చాలా తృప్తి గా అనిపించింది. ఆయన అభినందన మా ఆకలి తీర్చింది. అలాంటి అభినందనల కోసం మేమంతా కష్టపడతాం. వరుణ్ కటౌట్ ఎలా ఉందో చూశారు గదా. నేను బాక్సింగ్ రింగ్ లో నుంచున్నాను. వరుణ్ దగ్గరికి రాగానే ఆ కటౌట్ చూసి షాక్ అయ్యాను. నేను ఏం చేయాలి? ఎలా చేయాలి? అనుకున్నాను. వరుణ్ నాకు చాలా సపోర్ట్ చేశాడు. ఏప్రిల్ 8న 'గని' చాలా స్ట్రాంగ్ పంచ్ తో వస్తుంది .. చూసి ఎంజాయ్ చేయండి" అని చెప్పుకొచ్చాడు.




## 'పబ్ కి వెళ్లడమే తప్పా?'.. నిహారిక కు మద్దతుగా నిలిచిన తమన్నా..!



బంజారాహిల్స్ ర్యాడిసన్ బ్లూ హెూటల్ లోని ఫుడింగ్ అండ్ మింక్ పబ్ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. సమయానికి మించి రన్ చేస్తున్నారన్న సమాచారంతో ఆదివారం తెల్లవారు జామున ఈ పబ్ పై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. పబ్ లో పలు రకాల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఈ ఘటనలో పబ్ యజమానులు సహా సుమారు 150 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇందులో సినీ రాజకీయ ప్రముఖుల పిల్లలు ఉండటంతో ఈ ఇన్సిడెంట్ వివాదంగా మారింది. వారిలో సింగర్ బిగ్ బాస్ విన్నర్ రాహుల్ సిప్లిగంజ్ మరియు మెగా బ్రదర్ నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. దీంతో మీడియాలో - సోషల్ మీడియాలో వారినే హైలైట్ చేస్తూ కథనాలు ప్రసారం చేశారు. ఈ నేపథ్యంలో రాడిసన్ పబ్ ఘటనపై తాజాగా ట్రాన్స్ జెండర్ బిగ్ బాస్ కంటెస్టెంట్ తమన్నా సింహాద్రి స్పందించారు. ఈ మేరకు తమన్నా మీడియాతో మాట్లాడుతూ మెగా డాటర్ కు మద్దతుగా నిలిచారు. ఎవరో ఒకరిద్దరు తప్పు చేస్తే పబ్ కి వెళ్లిన వారందరిని దొంగల్లాగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పబ్ కు వెళ్లడమే తప్పు అన్నట్లుగా నిహారికపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.
"పబ్ కి వెళ్లడం పెద్ద తప్పు అన్నట్లుగా నిహారిక పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎవరో ఒకరు తప్పు చేస్తే.. పబ్ కి వెళ్లిన అందరినీ దొంగల్లాగా చూస్తున్నారు. నిహారిక తన ఫ్రెండ్ బర్త్ డే సెలెబ్రేషన్స్ కోసం వెళ్ళింది. ఆమె బర్త్ డే పార్టీలోనే ఉన్నారు. అక్కడికి వెళ్లిన అందరిని వదిలేసి నిహారికని మాత్రమే టార్గెట్ చేసి మీడియా - యూట్యూబ్ లో స్టోరీస్ వేస్తున్నారు. ఇది చాలా దారుణం" అని తమన్నా సింహాద్రి అన్నారు. ఇకపోతే ఫుడింగ్ మింక్ పబ్ వ్యవహారంలో తన కుమార్తె పేరు రావడం పై నాగబాబు కూడా స్పందించిన సంగతి తెలిసిందే. తన కూతురు విషయంలో ఎలాంటి సందేహాలు లేవని.. అంతా క్లియర్ అని స్పష్టం చేశారు నాగబాబు. నిహారిక తప్పులేదని పోలీసులు చెప్పారని.. ఊహాగానాలు ప్రచారం చేయొద్దని కోరారు.



## చిరు కుమార్తె ప్రయత్నం .. శ్రీదేవి శోభన్ బాబు

మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల కాస్ట్యూమ్ డిజైనర్ గా అనేక చిత్రాలకు పని చేశారు. ఇప్పుడు నిర్మాతగానూ లక్ చెక్ చేసుకోబోతున్నారు. ఆమె కాస్ట్యూమ్స్ డిజైన్ చేసి నిర్మించిన శ్రీదేవి శోభన్ బాబుప్రొడక్షన్ వెంచర్ టీజర్ ను స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ఈరోజు ఆవిష్కరించారు. టీజర్ లో సంతోష్ శోభన్ - గౌరీ జి కిషన్ మధ్య సన్నివేశాలు ఆద్యంతం అలరించాయి. ఆ ఇద్దరి స్వభావాలు.. కుటుంబాల నడుమ పర్యవసానం ప్రతిదీ ఒకదానికొకటి పూర్తిగా భిన్నంగా ఉంటాయి. కానీ విధి వారిని కలిపే ప్రయత్నం చేస్తే ఏమైంది? అన్నదే సినిమా. ప్రశాంత్ కుమార్ దిమ్మల రచన- దర్శకత్వం వహించిన శ్రీదేవి శోభన్ బాబును గోల్డ్ బాక్స్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై విష్ణు ప్రసాద్ తో కలిసి సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. శరణ్య పోట్ల ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి కమ్రాన్ సంగీతం అందిస్తుండగా.. సిద్దార్థ రామస్వామి సినిమాటోగ్రఫీ అందించారు. శశిదర్ రెడ్డి ఎడిటింగ్ అందిస్తున్నారు. సుస్మిత కొణిదెల నిర్మాణంలో తొలి ప్రయత్నంపై పరిశ్రమ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## ఎన్టీఆర్ - కొరటాల శివ మూవీ బడ్జెట్ అంతా?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ రీసెంట్ గా విడుదలైన భారీ మల్టీస్టారర్ ట్రిపుల్ ఆర్‌లో గోండు బెబ్బులి కొమురం భీం పాత్రలో నటించి ఆకట్టుకున్న విషయం తెలిసిందే. కొమురం భీం పాత్రలో ఎన్టీఆర్ పలికించిన అభినయం ప్రేక్షకులతో పాటు ఆయన అభిమానుల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. దీంతో ఎన్టీఆర్ పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో కలిసి ఎన్టీఆర్ నటించిన ఈ చిత్రం దేశ వ్యాప్తంగా సంచలన విజయాన్ని సాధిస్తూ భారీ వసూళ్లని రాబడుతున్న నేపథ్యంలో ఎన్టీఆర్ ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ సక్సెస్ ని ఎంజాయ్ చేస్తున్నారు. హీరోగా తనకు ఈ మూవీ పాన్ ఇండియా వైడ్ గా పాపులారిటీని తెచ్చిపెట్టడంతో మరింత జోష్ తో తన తదుపరి చిత్రానికి రెడీ అయిపో తున్నారంట. ఇటీవల దిల్ రాజు ఇచ్చిన పార్టీలో పాల్గొని ఎంజాయ్ చేసిన ఎన్టీఆర్ ఈ సినిమాతో తనకు హిందీలోనూ మంచి మార్కెట్ ఏర్పడటంతో తన తదుపరి చిత్రాన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్టుగా చెబుతున్నారు. అందులో భాగంగానే ఆ మూవీకి భారీ బడ్జెట్ ని కేటాయించబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ట్రిపుల్ ఆర్ తో తెలుగు సినిమా సత్తా మరింతగా ప్రపంచానికి తెలియడం బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ భారీ వసూళ్లని రాబట్టడంతో ఎన్టీఆర్ లో కొత్త జోష్ మొదలైందట. ఆ జోష్ కారణంగానే తన 30వ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్ తో తెరపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారట. ఈ మూవీ కోసం ఏకంగా 300 కోట్ల బడ్జెట్ ని కేటాయిస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.



ట్రిపుల్ ఆర్ ఎన్టీఆర్ పొటెన్షియలిటీని పూర్తి స్థాయిలో రాజమౌళి ఆవిష్కరించలేదు. దీంతో 30 వ సినిమాలో ఎన్టీఆర్ సత్తాని ఆయన నట విశ్వరూపాన్ని కొరటాల శివ ఆవిష్కరించ బోతున్నారట.
ఇందు కోసం ఎన్టీఆర్‌పై మాసీవ్ యాక్షన్ సీన్ లని ప్లాన్ చేస్తున్నారని ఇవి ప్రేక్షకులకు అభిమానులకు ఐ ఫీస్ట్ గా వుండ నున్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం స్క్రిప్ట్ చివరి దశకు చేరుకున్న ఈ మూవీని జూన్ లో అత్యంత భారీ స్థాయిలో లాంఛనంగా ప్రారంభిం చబోతున్నారు. బాలీవుడ్ క్రేజీ లేడీ అలియా భట్ ఈ చిత్రంలో ఎన్టీఆర్ కు జోడీగా నటించే అవకాశాలు వున్నట్టుగా తెలుస్తోంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com